

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 28-07-2022 సంపుటి : 03 సంచిక : 298 పేజీలు : 4 వెల : రూ 3-00


# కేంద్రంతో కుస్తీ పడుతున్నాం.. సీఎం జగన్ కీలక వ్యాఖ్యలు



ఏలూరు జిల్లా: ముంపు బాధితులకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఏలూరు జిల్లా తిరుమలాపురం, నార్లవరం వరద బాధితులను ఆయన బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, వరద బాధిత ప్రాంతాల్లో అధికారులు బాగా పనిచేశారని ప్రశంసించారు. ఇంత పారదర్శకతతో గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు.వరద సహాయ చర్యల్లో అధికార యంత్రాంగం అంతా పాల్గొంది. ఎన్యుమరేషన్ ప్రారంభించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి రూ.10వేల ఆర్థిక సాయం ఇవ్వాలని ఆదేశించామని సీఎం తెలిపారు. వరదలతో నష్టపోయిన ప్రతిఒక్కరినీ ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. ఏ సీజన్‌లో నష్టం జరిగితే అదే సీజన్‌లో సాయం అందిస్తామన్నారు. సాధ్యమైనంత త్వరగా ముంపు బాధితులకు పరిహారం అందిస్తామని సీఎం జగన్ పేర్కొన్నారు."ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ కోసం కేంద్రంతో కుస్తీ పడుతున్నాం. ఈ ప్యాకేజీకి రూ.20 వేల కోట్లు అవసరం. కేంద్రంతో యుద్ధం చేస్తానే ఉన్నాం. కేంద్రం తప్పనిసరిగా ఆదుకోవాల్సిన అవసరం ఉంది. తక్కువ మొత్తం అయితే కేంద్రం ఇవ్వకున్నా మేమే ఇచ్చేవాళ్లం. రూ.20 వేల కోట్లు అయ్యేసరికి ఏమీ చేయలేకపోతున్నాం. ప్రధానిని ఇప్పటివరకు మూడుసార్లు కలిశా. కేంద్ర మంత్రులను మన మంత్రులు కలుస్తూనే ఉన్నారు. అయినా కేంద్రం నుంచి అనుకున్న స్థాయిలో కదలిక లేదు. ప్రధాని మోదీని కలిసి వరద ఏ స్థాయిలో ఉందో వివరిస్తా. వీలైనంత త్వరగా ఆర్థిక సాయం అందించాలని ప్రధానిని కోరతామని" సీఎం జగన్ అన్నారు.

# వరద బాధితులందరికీ న్యాయం చేస్తాం..

### సెప్టెంబర్‌లోగా పోలవరం పరిహారం: సీఎం జగన్



అల్లూరి: వరద బాధితులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూసుకున్నామని, పోలవరం నిర్వాసితులకే న్యాయం చేశాకే పోలవరంలో నీళ్లు నింపుతామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరు మండలం కోయుగూరులో వరద బాధితులతో సీఎం జగన్ పరామర్శ కొనసాగింది. చింతూరులో దాదాపుగా 20 రోజుల నుంచి మొదటి ప్రమాదపు ఘంటికపైనే దాదాపుగా ఇన్నిరోజులు నీళ్లు ఉన్న పరిస్థితులు చూడలేదు. నాలుగు మండలాల్లో కలెక్టర్ 20 రోజుల పాటు ఉన్నారు. కలెక్టర్, అధికారులు, వలంటీర్లు.. ఇక్కడే ఉండి పరిస్థితి సమీక్షించడం అభినందనీయం. సహాయం అందరికీ అందాలనే తాపత్రయం.. గతంలో కన్నా పరిస్థితిలో ఎంతో మారిందని సీఎం జగన్ చెప్పారు. పారదర్శకంగా బాధితులకు పరిహారం అందించాం. అందరికీ రేషన్, ఇంటింటికీ రూ. 2 వేలు అందించాం.



అధికారులను భాగస్వామ్యం చేసి.. కావాల్సిన వనరులు సమకూర్చాం అని సీఎం జగన్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అందరికీ సహయం, అన్ని సౌకర్యాలు అందాయని నిర్వాసితులు తెలిపారు. ఎవరికి, ఎలాంటి వరద నష్టం జరిగినా సరే.. గ్రామ సచివాలయంలో లిస్ట్‌లో ఉంటుందని, నష్టం వివరాలు ఏమైనా ఉంటే పేరు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని సీఎం జగన్ స్పష్టం తెలియజేశారు. అర్హత ఉన్న అందరికీ రెండు నెలల్లోగా పరిహారం అందుతుందని, ఎలా ఎగ్గొట్టాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి ఉండబోదని పేర్కొన్నారు సీఎం జగన్. తాటాకు గుడిసెల నిర్వాసితులకు పరిహారం రూ. ఐదు వేల నుంచి పదివేలకు పెంచుతామని హామీ ఇచ్చారు.పోలవరం ముంపు బాధితుల విషయంలో కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు గనుక రాకపోతే.. భారం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని, సెప్టెంబర్ లోగా పోలవరం ముంపు బాధితులకు పరిహారం అందిస్తామని, నిర్వాసితులకు పరిహారం అందాకే.. పోలవరంలో నీళ్లు నింపుతామని సీఎం జగన్ తెలిపారు. కేంద్రంపై ఒత్తిడి పెంచుతాం.. నిర్వాసితులను ఆదుకుంటాం అని సీఎం జగన్ స్పష్టం చేశారు.

# జనసేన నుంచి నన్ను ఎవరూ సస్పెండ్ చేయలేరు: బొలిశెట్టి

పశ్చిమ గోదావరి జిల్లా: జనసేన పార్టీ నుంచి తనను ఎవరూ సస్పెండ్ చేయలేరని చెప్పారు జనసేన నేత బొలిశెట్టి శ్రీనివాస్. అంత ధైర్యం కూడా పార్టీలో ఎవరికీ లేదన్నారు. తనకు తాను జనసేన భీష్ముడిగా పోల్చుకున్న బొలిశెట్టి శ్రీనివాస్.. తాడేపల్లిగూడెంలో మీడియాతో మాట్లాడుతూ పై విధంగా వ్యాఖ్యానించారు. బొలిశెట్టి శ్రీనివాస్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్‌పై ఆయన తీవ్రంగా స్పందించారు.సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ పోస్ట్ చేసిన వారిని ఉద్దేశించి.. దమ్ముంటే



మీ పేరు పెట్టండని సవాల్ విసిరారు. తాను చావాలి అనుకుంటే తప్ప తనకు చావు లేదన్నారు. జనసేన భీష్ముడిని పార్టీ నుంచి తొలగించే ధైర్యం ఎవరూ చేయరన్నారు. సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్న ఫేక్ వార్తలపై సైబర్ క్రైమ్ పోలీసులు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. దొంగ టెండర్లు వేసి స్థలాలు కబ్జా చేసే వాడిని కాదని.. సొంత డబ్బుతో ప్రజాసేవ చేస్తున్నానని చెప్పుకొచ్చారు. బొలిశెట్టి శ్రీనివాస్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లుగా సోషల్ మీడియాలో ఫేక్ వార్తలు ట్రోల్ అవుతున్నాయి. ఇలా ట్రోల్ చేసేవారికి త్వరలోనే సమాధానం చెప్తానన్నారు. తన ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కొందరు ఇలా ఫేక్ వార్తలు సృష్టించి ప్రచారం చేస్తున్నారని బొలిశెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలంగాణ, ఏపీలో అసెంబ్లీ సీట్ల పెంపుపై కేంద్రం క్లారిటీ



తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ సీట్ల పెంపుపై కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. అసెంబ్లీ నియోజకవర్గాల పెంపునకు రాజ్యాంగ సవరణ అవసరమని పేర్కొంది. సీట్లు పెంచాలంటే 2026 వరకు ఆగాల్సిందేనని, అప్పటి వరకు రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు సాధ్యం కాదని తెలిపింది. పార్లమెంట్‌లో ఏపీ ఎంపీ జీవీఎల్ నరసింహరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.గత ఏడాది సైతం కేంద్రం పార్లమెంట్‌లో ఇదే విషయం తెలిపిన విషయం తెలిసిందే. 2026 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి, సీట్లు పెంచే ఆలోచన లేదని కేంద్రం పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 (3) ప్రకారం.. 2026 తర్వాత మొదటి జనాభా గణనను ప్రచురించిన తర్వాత రాష్ట్రాల అసెంబ్లీలో మొత్తం సీట్ల సంఖ్య పెంపు ఉంటుందని చెప్పింది.ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 26(1) ప్రకారం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 170లో ఉన్న నిబంధనలకు లోబడి.. ఈ చట్టంలోని సెక్షన్ 15 ఎలాంటి పక్షపాతం లేకుండా.. ఆంధ్రప్రదేశ్‌లో 175 నుంచి 225, తెలంగాణలో 119 నుంచి 153 స్థానాలకు పెరుగుతాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170(3) ప్రకారం, 2026 సంవత్సరం తర్వాత మొదటి జనాభా గణనను ప్రచురించిన తర్వాత రాష్ట్ర అసెంబ్లీలో మొత్తం సీట్ల సంఖ్య తిరిగి సర్దుబాటు' ఉంటుంది అని కేంద్రం పేర్కొంది.

# ఏపీలో రైల్వే ప్రాజెక్ట్‌లపై చేతులెత్తేసిన కేంద్రం

ఢిల్లీ: ఏపీలో రైల్వే ప్రాజెక్ట్?లపై కేంద్రం చేతులెత్తేసింది. ఏపీలో రైల్వే ప్రాజెక్ట్?లను చేపట్టలేమని రైల్వేశాఖ తేల్చి చెప్పినట్లు సమాచారం. లోక్?సభలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఏపీలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై ఎంపీ బాలశౌరి అడిగిన ప్రశ్నకు రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిచ్చారు. రైల్వే ప్రాజెక్టులకు ఏపీ నిధులను కేటాయించడం లేదని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. రూ.1,798 కోట్లు పెండింగ్ నిధులు ఏపీ ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ఏపీలో కొత్త ప్రాజెక్టులు చేపట్టలేమని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.



# విశాఖ రిషికొండ తవ్వకాలపై ఏపీ హైకోర్టు ఆగ్రహం

అమరావతి: విశాఖ రిషికొండ తవ్వకాలపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రిషికొండలో అనుమతించిన దాని కంటే అక్రమ తవ్వకాలు ఉంటే జైలుకు వెళ్లక తప్పదని స్పష్టం చేసింది. ఆరు నెలల పాటు అందరూ లోపలికి వెళ్లాల్సి ఉంటుందని హైకోర్టు హెచ్చరించింది. రిషికొండ అక్రమ తవ్వకాలపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. టూరిజం కార్పొరేషన్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ లాయర్ అభిషేక్ మనుసింఘ్వీ హాజరయ్యారు. ఈ క్రమంలో అఫిడవిట్ దాఖలు చేసేందుకు వారం రోజులు గడువు కావాలని ధర్మాసనాన్ని సంఘ్వీ కోరారు. రిషికొండ దగ్గర 9 ఎకరాల పరిధిలో మాత్రమే తవ్వకాలకు హైకోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే.అయితే 30 ఎకరాల్లో అక్రమ తవ్వకాలు జరిపారని ధర్మాసనానికి పిటిషనర్ తరపు న్యాయవాది అశ్విని కుమార్



వివరించారు. తవ్విన మట్టిని సముద్రంలో వేయాలని కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులపై పిటిషనర్‌లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వ్యక్తిగతంగా ఎవరైనా వెళ్లి ఆ ప్రాంతాన్ని సందర్శించారా అని న్యాయస్థానం ప్రశ్నించింది. తాను పర్యటించి పరిశీలించానని న్యాయవాది అశ్విని కుమార్ చెప్పారు. పిటిషనర్ల విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వం తేలికగా తీసుకుంటుందని లాయర్లు ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. ఎవరు తేలికగా తీసుకున్నా... తాము మాత్రం అక్రమాలు జరిగితే వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ... రిషికొండ తవ్వకాల కేసు విచారణ హైకోర్టు వాయిదా వేసింది.

# సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన జాహ్నవి దంగేటి



తూర్పుగోదావరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పాలకొల్లుకు చెందిన జాహ్నవి దంగేటి బుధవారం కలిశారు. నాసా ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్‌లో పాల్గొని చరిత్ర సృష్టించిన మొదటి ఇండియన్‌గా జాహ్నవి గుర్తింపు తెచ్చుకున్నారు. రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి వరద బాధితులను పరామర్శించేందుకు బయలుదేరుతున్న ముఖ్యమంత్రిని కలిసి.. పైలెట్ ఆస్ట్రోనాట్ అవ్వాలన్న తన కోరికను వివరించి, ఇందుకు అవసరమైన శిక్షణకు అయ్యే ఖర్చుకు సాయం చేయాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు.భారత సంతతికి చెందిన కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్‌లా అంతరిక్షంలోకి అడుగుపెట్టాలన్న సంకల్పంతో ముందుకెళుతున్నట్లు సీఎంకి వివరించింది. జాహ్నవి విజ్ఞప్తిపై సీఎం జగన్.. సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, జాహ్నవి కుటుంబ సభ్యులు ఉన్నారు.

# ఈడీ పోలీస్ విభాగం కాదు.. అయినా అరెస్టులు సరైనవే: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ (పీఎంఎల్ఏ) ప్రకారం విచారణ, అరెస్టులు, ఆస్తుల జప్తు చేపట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారాలను సమర్థించింది సుప్రీం కోర్టు. ఈ మేరకు దాఖలైన పిటిషన్‌పై బుధవారం కీలక వ్యాఖ్యలే చేసింది. పీఎంఎల్ఏ చట్టంలోని నిబంధనల చట్టబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ ఎంఏ ఖాన్విల్కర్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అధికారులు కల్పించే.. పీఎంఎల్ఏ చట్టంలోని సెక్షన్లు 5, 8(4), 15,17,19లు చట్టబద్ధమేనని స్పష్టం చేసిన ధర్మాసనం.. బెయిల్ విషయం లోనూ సెక్షన్ 45 సరైనదేనని నొక్కి చెప్పింది .పీఎంఎల్ఏలోని పలు సెక్షన్లను



సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది ధర్మాసనం. దర్యాప్తు సంస్థలైన ఈడీ, తీవ్ర నేరాల దర్యాప్తు కార్యాలయం(ఎస్ఎఫ్ఐఓ), డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) వంటివి పోలీసు విభాగాలు కాదని స్పష్టం చేసింది ధర్మాసనం. అయితే విచారణలో భాగంగా ఆయా సంస్థలు నమోదు చేసే వాంగ్మూలాలు ఆధారాలేనని పేర్కొంది.మనీలాండరింగ్ కేసులో నిందితులను అదుపులోకి తీసుకుంటున్న సమయంలో అరెస్ట్‌కు సంబంధించిన విషయాలను ఈడీ అధికారులు వెల్లడించటం తప్పనిసరి కాదని పేర్కొంది సుప్రీం కోర్టు.

# సంపాదకీయం

గురువారం 28-07-2022

## కొత్త చట్టాలతో అడవులు మాయం

భూసేకరణకు గ్రామసభ తీర్మానమే తొలిమెట్టు. నిర్వాసితులకు పరిహార చెల్లింపు కేసుల్లో కూడా మేజిస్ట్రేటు ముందుగా గ్రామసభ తీర్మానాన్ని పరిశీలిస్తారు. అయితే కేంద్రం అటవీ చట్టానికి తెచ్చిన కొత్త సవరణల ప్రకారం అడవిని ఆక్రమించేందుకు నివాసితుల గ్రామసభ తీర్మానం అక్కర లేదు. రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం లేకుండా అడవి అప్పగింత కేంద్రం స్థాయిలోనే జరిగిపోతుంది. పైగా కేంద్రం నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు శిరసావహిస్తూ కేంద్రం కేటాయించిన భూమిని ఖాళీ చేయించి నిర్వాసితులకు మరో చోట పునరావాసం కల్పించాలి. దేశంలో జాతీయ పార్టీల కొరత ఉన్నందున ఇలాంటి నిర్ణయాలపై పెద్దగా చర్చ జరగడం లేదు. కాంగ్రెస్ పార్టీ తరపున రాహుల్ గాంధీ ఈ చర్యను ఖండిస్తూ దేశంలోని అటవీసంపదకు, ఆదివాసీ బతుకులకు ఇది గొడ్డలిపెట్టు అని ప్రకటించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అటవీ పరిరక్షణ చట్టానికి తెచ్చిన నష్టకారక నిబంధనలకు దేశమే మౌనసాక్షిగా నిలిచింది. జూన్ 28న కేంద్రం చేపట్టిన అటవీ పరిరక్షణ చట్టం, 2008లో విధి విధానాల మార్పు వల్ల దేశంలోని అడవి పూర్తిగా పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం అయ్యే అవకాశం ఉంది. ఆ చట్టానికి 2022 సవరణలు పేరిట తెచ్చిన మార్పులతో పరిశ్రమల వ్యవస్థాపకులు ఎక్కడఅడవినైనా యథేచ్ఛగా నరికివేయవచ్చు. ఇలాంటి కీలక నిర్ణయాల కోసం పార్లమెంటులో చర్చ, స్థాయీ సంఘాల భేటీ, నిపుణులతో సంప్రదింపులు, ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వానికైనా తప్పనిసరి. అయితే కేంద్రంలో ఇందుకు భిన్నంగా, ఏకపక్షంగా భారీ మార్పు లు జరిగిపోతున్నాయి. బిజెపికి పార్లమెంటులో కావాల్సినంత మెజారిటీ ఉన్నా చర్చల వల్ల తమ అసలు రంగు లోకానికి తెలుస్తుందన్న వెరుపుతో ప్రభుత్వం ప్రజాస్వామ్య విధానాలను దాటేస్తూ అనుకూల నిర్ణయాలు, చట్ట సవరణలు తెస్తోంది. దేశంలో ఎలాంటి ప్రాజెక్టుల నిర్మాణానికి గాని, పరిశ్రమల స్థాపనకు గాని నివాస, వృత్తిపర స్థలాలను ఉపయోగించేందుకు ఆయా గ్రామ సభల తీర్మానం ప్రధానమైనది. గ్రామసభ చట్టసభ కాకున్నా గ్రామస్థులందరు చర్చించుకొని ఒక అభిప్రాయానికి రావడానికి ఇది వీలు కల్పిస్తుంది కాబట్టి గ్రామసభకు అంత ప్రాధాన్యత ఉంది. భూసేకరణకు గ్రామసభ తీర్మానమే తొలిమెట్టు. నిర్వాసితులకు పరిహార చెల్లింపు కేసుల్లో కూడా మేజిస్ట్రేటు ముందుగా గ్రామసభ తీర్మానాన్ని పరిశీలిస్తారు. అయితే కేంద్రం అటవీ చట్టానికి తెచ్చిన కొత్త సవరణల ప్రకారం అడవిని ఆక్రమించేందుకు నివాసితుల గ్రామసభ తీర్మానం అక్కర లేదు. రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం లేకుండా అడవి అప్పగింత కేంద్రం స్థాయిలోనే జరిగిపోతుంది. పైగా కేంద్రం నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు శిరసావహిస్తూ కేంద్రం కేటాయించిన భూమిని ఖాళీ చేయించి నిర్వాసితులకు మరో చోట పునరావాసం కల్పించాలి. దేశంలో జాతీయ పార్టీల కొరత ఉన్నందున ఇలాంటి నిర్ణయాలపై పెద్దగా చర్చ జరగడం లేదు. కాంగ్రెస్ పార్టీ తరపున రాహుల్ గాంధీ ఈ చర్యను ఖండిస్తూ దేశంలోని అటవీసంపదకు, ఆదివాసీ బతుకులకు ఇది గొడ్డలిపెట్టు అని ప్రకటించారు. ఆయన ఖండన చిన్న వార్తగా మిగిలిపోయింది. ఈ నిర్ణయాన్ని గట్టిగా తిరస్కరించే సాహసం కూడా కాంగ్రెస్ చేయకపోవచ్చు. నిజానికి తమ హయాంలో కూడా అటవీ పరిరక్షణ చట్టం, 2008 సవరణలకు కాంగ్రెస్ పూనుకుంది. ఆనాటి అటవీ, పర్యావరణ, పరిశ్రమల మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం కుదరకపోవడంతో ముం దుకు సాగలేదు. 2011-14 మధ్యకాలంలో కేంద్రంలో గిరిజన సంక్షేమ మంత్రిగా ఉన్న వై. కిషోర్ చంద్ర దేవ్ అడవి భూముల కేటాయింపులపై తన వద్దకు వచ్చిన చాలా ప్రతిపాదనలను తిప్పిపంపేవారటనిజానికి అటవీ పరిరక్షణ చట్టం, 2008 ప్రకారం కేంద్రం ప్రైవేటు ప్రాజెక్టులకు అనుమతినిచ్చే ముందే అడవి బిడ్డల అంగీకారం తీసుకొని, వారి హక్కులకు భంగం కలుగకుండా చూసుకోవాలి. కొత్త సవరణ ప్రకారం చూస్తే రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలకు పోడు సాగుకు భూములు పంపిణీ చేసినా ఆ భూముల్ని సైతం కేంద్రం ఎవరి అనుమతి లేకుండా అప్పగించవచ్చు. దీని వల్ల 2006లో వచ్చిన ఆదివాసీ, ఇతర సాంప్రదాయిక అడవి నివాసుల అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా అడవి బిడ్డలకు సంక్రమించిన హక్కు లు కూడా కోల్పోతారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ గిరిజనుల సంక్షేమం కోసం పోడు భూమిపై హక్కు పత్రాలు ఇచ్చినా ఆ భూమిని కేంద్రం ఒక్క పెన్ను పోటుతో ఇతరుల పాలు చేయవచ్చు. తిరిగి ఆ నిర్వాసితులకు పరిహారంగా ఇచ్చే భూమిని కేటాయించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. అంతా అయ్యాక ఆ భూమి కూడా లబ్ధిదారుకి దక్కేది ఎన్నాళ్ళో చెప్పే వీలు లేదు. కేంద్రం అదే భూమి మరో ప్రాజెక్టుకు అప్పగిస్తే ఖాళీ చేయాల్సిందే. ఈ చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం అటవీ భూముల్లో పరిశ్రమల స్థాపన కోసం కేంద్రంలో ఉండే ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీని సంప్రదించాలి. 2012లో ఆ నాటి కేంద్ర ప్రభుత్వం అడవి భూముల్లో రోడ్లు, పైపులైన్లు, రైలు పట్టాలు వేసేందుకు గ్రామసభ తీర్మానాలు అవసరం లేదని ఆ చట్టానికి ఒక సవరణ చేసింది. ప్రజావసరాలు, ప్రభుత్వ పనులు జాప్యం కావద్దని ఆ నిర్ణయం తీసుకొని ఉండవచ్చు. అయితే దానినే దృష్టిలో పెట్టుకొని 2014 నుండే మోడీ ప్రభుత్వం అటవీ పరిరక్షణ చట్టాన్ని నిర్వీర్యం చేసే పనిలో పడింది. అక్టోబర్ 2014లో జరిగిన సమావేశంలో గిరిజన, పర్యావరణ శాఖలు ఆదివాసీ హక్కుల చట్టం, 2006లో గ్రామసభ తీర్మానాల మినహాయింపు లేదని చెప్పడంతో రంగం ముందు కు సాగలేదు. నిజానికి 1927 లో బ్రిటిష్ వాళ్లు అడవిలో రోడ్లు, రైలు పట్టాలు వేసేందుకు, పరిశ్రమలు నెలకొల్పేందుకు తమ ఇష్టానుసారంగా ఓ చట్టాన్ని తెచ్చారు. అయితే దాని నుండి అడవిని, ఆదివాసీల హక్కులను రక్షించేందుకే కొత్త సొంత చట్టాలు వచ్చాయి. వాటిలో గ్రామసభ తీర్మానానికి ప్రముఖ స్థానాన్ని ఇచ్చారు. ఇప్పుడు కేంద్రం తీసుకొన్న సవరణల వల్ల తిరిగి బ్రిటిష్ చట్టానికి ప్రాణం పోసినట్లవుతుంది. ఈ సవరణల ప్రకారం కేంద్రంలో ఐదుగురు సభ్యుల కమిటీ నెలకు రెండు సార్లు సమావేశమై ప్రభుత్వానికి చేరిన కొత్త ప్రైవేటు ప్రాజెక్టులను పరిశీలించి అటవీ భూముల కేటాయింపుకు కాల పరిమితిని పెడుతూ రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతుంది. కేంద్ర పర్యావరణ శాఖ అక్టోబర్ 2, 2021 రోజున చిన్న ప్రకటనని ఇచ్చింది. దీనిపై 5 వేలకు పైగా అభిప్రాయాలు, సూచనలు వచ్చాయి. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం తన నిర్ణయానికే కట్టుబడింది. 22% అరణ్య వ్యాప్తమైన మన దేశంలో 33% అడవి ఉండాలని ఒక వైపు పర్యావరణ శాఖ అంటుండగా ఆమాత్రం కూడా దక్కకుండా అదే ప్రభుత్వం నిర్ణయాలు ఉంటున్నాయి. అడవిపై ఆయా రాష్ట్రాలకు, అక్కడి ప్రజలకు ఎలాంటి హక్కు లేకుండా చేసిన ఈ చట్ట సవరణలు దేశంలో ప్రైవేటు శక్తుల వీరంగానికి కేంద్రం వేస్తున్న మరో అడుగుగా భావించాలి.

# డిఫెన్స్‌లో చిత్తూరు మంత్రులు


తిరుపతి, జూలై 27, టీడీపీ అధినేత వ్యాఖ్యలతో ఆ ఇద్దరు మంత్రులు డిఫెన్స్‌లో పడ్డారా? ఎలా స్పందించాలో తెలియక సైలెంట్‌గా ఉంటున్నారా.. లేక వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తున్నారా? పాచిక పారిందని తెలుగు తమ్ముళు ఆ కామెంట్స్‌ను జనాల్లోకి బలంగా తీసుకెళ్తున్నారా? ఈ మధ్య కాలంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యటించారు. ఆ సందర్భంగా తిరుపతి, అన్నమయ్య జిల్లాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు స్థానికంగా రాజకీయ వేడి రగిలించాయి. అవి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజాలకు తగలడంతో ఆ శిబిరాల్లో కలవరం మొదలైందట. జిల్లాల విభజన తర్వాత కొన్ని ప్రాంతాల విషయంలో ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. నగరిని తిరుపతి జిల్లాలో కలపాలని.. పుంగనూరును అన్నమయ్య జిల్లాల్లో కలపాలనే డిమాండ్ ఉంది. ఈ నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలుగా ఉన్న ఆర్కే రోజా.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలను ఈ విషయంలో కలిసి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. మంత్రుల నుంచి చూద్దాం.. చేద్దాం అనే మాటలే తప్ప స్పష్టమైన హామీ లేదనే అసంతృప్తి స్థానికుల్లో ఉంది. సరిగ్గా ఇదే అంశాన్ని తన పర్యటనలో పొలిటికల్ అస్త్రంగా మార్చుకున్నారు చంద్రబాబు. టీడీపీ అధికారంలోకి వస్తే నగరి నియోజకవర్గాన్ని పూర్తిగా తిరుపతి జిల్లాలో.. పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కలుపుతానని టీడీపీ అధినేత హామీ ఇచ్చారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకోవడంతో మంత్రులు శిబిరాలు ఇరకాటంలో పడ్డాయట. నగరి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నగరి, నింద్ర, విజయపురంలు చిత్తూరు జిల్లాలో.. పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాలోకి వెళ్లాయి. ఆ మూడు మండలాల జనం కూడా తమను తిరుపతి జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తున్నారు. పుత్తూరు, వడమాలపేటలు తిరుపతికి దగ్గరగా ఉండటంతో వాటిని ఆ జిల్లాలో కలపడానికి రోజా అభ్యంతరం చెప్పలేదని ప్రచారం జరుగుతోంది. కానీ.. మిగతా మూడు మండలాల ప్రజలు రివర్స్ కావడంతో అధికారపార్టీ వర్గాలకు మింగుడు పడని పరిస్థితి ఉందట. ఇదే అంశంపై పలుమార్లు మంత్రి రోజాను కలిసి విన్నవించారు కూడా. నగరిలో పర్యటించిన చంద్రబాబు ఈ అంశాన్ని రాజకీయంగా వాడేసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే నగరి నియోజకవర్గాన్ని మొత్తానికి మొత్తంగా తిరుపతి జిల్లాలో కలుపుతామనే హామీ ఇచ్చారు చంద్రబాబు. దీనికి సానుకూల స్పందన వచ్చిందనే అభిప్రాయంలో పార్టీ వర్గాలు ఉన్నాయి. చంద్రబాబు వెళ్లిన తర్వాత కూడా నగరి టీడీపీ ఇంఛార్జ్ గాలి భాను ప్రకాష్ సైతం ఇదే నినాదంతో నియోజకవర్గంలో పర్యటనలు చేస్తున్నారు. పుంగనూరులోనూ ఇదే తరహా బాణం వేశారు చంద్రబాబు. ఇక్కడ టీడీపీ అధినేతకు రాజకీయ ప్రత్యర్థి అయిన మంత్రి పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి ఉన్నారు. పుంగనూరు ప్రజల కోరిక మేరకు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కలుపుతామని చంద్రబాబు చెప్పడంతో.. పెద్దిరెడ్డి టీమ్ అలర్ట్ అయిందట. ఇప్పటికైతే ఎలాంటి స్పందన లేకపోయినా.. వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నట్టు భావిస్తున్నారు వైసీపీ కార్యకర్తలు. పుంగనూరు అజెండా లక్ష్యంగా టీడీపీ ఇంఛార్జ్ చల్లా బాబు సైతం ప్రచారం స్పీడ్ పెంచారు. మొత్తానికి నగరి, పుంగనూరు విషయంలో వేసిన పాచిక పొలిటికల్‌గా వర్కవుట్ అయ్యిందనే లెక్కల్లో తెలుగు తమ్ముళ్లు ఉన్నారు. దీనికి విరుగుడు వేసే పనిలో వైసీపీ శిబిరం ఉంది. ప్రస్తుతానికి మౌనంగానే ఉన్నా.. సరైన సమాధానంతో ముందుకొస్తారనే చర్చ జరుగుతోంది. మరి.. నగరి, పుంగనూరు విషయంలో ఏం జరుగుతుందో చూడాలి.

# అలా ముందుకు వెనక్కి రైల్వే జోన్ అడుగులు

విశాఖపట్టణం, జూలై 27, విశాఖ రైల్వేజోన్ వ్యవహారం. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కి విశాఖ రైల్వేజోన్ ని తాయిలంలా చూపింది. ఎన్నికలకు ముందు ఆ తాయిలం చూపించి అధికారంలోకి రావడానికి ఉపయోగించుకుంది. అనేక రాష్ట్రాలకు ఇచ్చి న హామీలతో పాటు ఆంధ్రాకు సంబంధించిన విశాఖ రైల్వేజోన్ సంగతి కూడా అటకెక్కించింది మోదీ సర్కారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తూనే ఉందని మంత్రులు, ఎంపీలు, సీఎం కూడా ప్రజలకు చెబుతూనే ఉన్నారు. కానీ కేవలం చెప్పడం, వారు మభ్యపెట్టడమే ఇన్నాళ్లూ జరుగుతోంది. వీరి మధ్య విశాఖ జోన్ విషయంలో భాషాంతరమేమన్నా ఉందేమోననుకున్నారంతా. అదేమీ కాదు కేంద్రం కావాలనే జాప్యం చేస్తున్నదని ఇటీవలే బాగా స్పష్టమయింది. ప్రధాని సుముఖానికి చాలాసార్లు వెళ్లిన సీఎం జగన్ ఈ అంశాన్ని గురించి అసలు చర్చించారో లేదో ఇంతవరకూ తెలీదు. అసలు ఆయన పర్యటనల సారాంశం ఎప్పుడూ రహస్యమే. అందుకే ఆయన స్వంత పనులమీద వెళ్లివస్తున్నారన్న ఆరోపణలే ఎక్కువయ్యాయి. ఇహ ఇప్పుడు కేంద్రానికి అసలు దాన్ని గురించి ఆలోచించే సమయమే లేదని అంటు న్నది. ఎవరు ఎవర్ని భ్రమలో పెట్టారన్నది దీన్నిబట్టీ తెలుస్తోంది. గతంలో కేంద్రమే తీసుకున్ననిర్ణయాన్ని వారే నిర్లక్ష్యం చేస్తున్నారు. అంటే వారికి అవసరమైన సమ యంలో రాష్ట్రానికి కావలసినవి చేస్తామనడం, ప్రజలు, నాయకుల మాటని విన్నట్టు నటించడం తప్ప వాస్తవానికి ఏమీ ఆలోచించడం లేదు. అన్నింటికంటే విచిత్రమేమంటే ఎలాంటి రైల్వే జోన్ లేదనీ చెబు తూండడం. మరోవంక బీజేపీ నేతలు ఇచ్చేశామని ప్రచార హడావుడి చేయడం. దీనికి తోడు గత ఫిబ్రవరి లో దేశంలో ఇక కొత్త రైల్వే జోన్ల ఏర్పాటు చేసే ఉద్దేశం లేదని పార్లమెంటులోనే కేంద్రం తేల్చి చెప్పేసింది. ఇక కేంద్రాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు తిట్టుకోవడం తప్ప చేసేదేమీ లేదు. అసమర్థ పాలకుడు, మాటలు నేర్చిన మాంత్రికుడితో కలిస్తే ఇలానే ఉంటుంది. కేంద్రం కేవలం

కబుర్లు చెప్పడం తప్ప కొత్త రాష్ట్రానికి చేస్తున్నదేమీ లేదన్న అభిప్రాయాలకు ఇది మరింత ఊతమిస్తోంది. కేంద్రం విశాఖ రైల్వేజోన్ అంశాన్ని పాతబడ్డ చింతకాయపచ్చడిగా పేర్కొంటూ దాన్ని గురించి చర్చోప చర్చలు చేయడం శుద్ధ దండగ అంటోంది. పైగా వాల్తేరు డివిజన్‌ను ఒడిషాలో కలిసేసింది. చిత్రమే మంటే, విశాఖ రైల్వే జోన్ పనులు అసలు ప్రాథమికంగా కూడా ప్రారంభం కాలేదు కానీ వాల్తేర్‌ను లాగేసు కుని రాయగడలో కలుపుకునే పనులు మాత్రం పూర్తయ్యాయి. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుకు అన్ని రకాల సౌకర్యాలు విశాఖలో ఉన్నాయి. కానీ కేంద్రం ఈ విషయంలో నిర్లక్ష్యాన్నే ప్రదర్శిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దగ్గర దాసోహం అంటూండటమే అందుకు కారణమనే విమర్శలు వినపడుతు న్నాయి.

# పవన్ రూట్ మారుస్తారా...



విజయవాడ, జూలై 27, అందరూ ఊహిస్తున్నట్లు జరిగే అవకాశాలు లేవు. జనసేన అధినేత పవన్ కల్యాణ? వచ్చే ఎన్నికల నాటికి బీజేపీని వదిలేసి టీడీపీ తో కలుస్తారని ప్రచారం జరుగుతుంది. అయితే పవన్ బీజేపీని దూరం చేసుకునే అవకాశాలు లేవు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని వదిలి పెట్టే ఆలోచన అయితే చేయరు. ఎందుకంటే మళ్లీ 2024 ఎన్నికల్లో బీజేపీయే కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్న సర్వేలు వస్తున్నాయి. బీజేపీకి పోటీ ఇచ్చే మరో పార్టీ లేదు. కాంగ్రెస్ అన్ని రాష్ట్రాల్లో బలహీనంగా ఉంది. యూపీఏలోని పక్షాలన్నీ కలసి కట్టుగా వచ్చి కాంగ్రెస్ తో జత కట్టే పరిస్థితి కన్పించడం లేదు. బీజేపీయే మరోసారి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్న సర్వేలు నిజమవుతాయో? లేదో? చెప్పలేం కాని, దానిని పూర్తిగా మాత్రం కొట్టి పారేయలేం. 2019 ఎన్నికల్లో పవన్ బీజేపీని విభేదించారు. దానితో కలసి పోటీ చేయడానికి కూడా ఇష్టపడలేదు. బీఎస్పీ, కమ్యునిస్టులను మాత్రమే కలుపుకుని వెళ్లారు. బీజేపీని ఒంటరిగా పోటీ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఆ పార్టీని తూలనాడారు. కేంద్రంలో మరోసారి అధికారంలోకి రాదన్న అంచనా వేశారు. కానీ అనూహ్యంగా 2014 కంటే మెరుగైన సీట్లను బీజేపీ సాధించింది. అందుకే 2019 ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే పవన్ బీజేపీతో నేరుగా పొత్తుకు సిద్ధమయ్యారు. మోదీ చరిష్మాతో పాటు తన ఇమేజ్ కలిస్తే ఏపీలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని భావించారు. ఇప్పుడు బీజేపీని వదిలేస్తే మరో సారి తప్పిదం చేసినట్లు అవుతుందని పవన్ భావిస్తున్నారు. ఏపీలో అధికారం వచ్చినా, రాకున్నా బీజేపీతో కయ్యానికి దిగడం పవన్ కు ఇష్టంలేదు. బీజేపీని టీడీపీని కలిపేందుకు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అది సాధ్యపడే అవకాశాలు కన్పించడం లేదు. ఒకవేళ జనసేన, టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సజావుగా ప్రభుత్వాన్ని నడవనిచ్చే పరిస్థితి ఉండదు. సహకరించే పరిస్థితి ఉండదు. రెండు పార్టీలతో ఏర్పడిన ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. అందుకే బీజేపీని దూరం చేసుకోవడం మంచిది కాదన్న అభిప్రాయంలో పవన్ ఉన్నారని తెలిసింది. ట్రయాంగల్ ఫైట్ తప్పదా? టీడీపీతో ఇప్పుడు కలిసినా, కలవకపోయినా పెద్దగా నష్టమేమీ లేదు. కాకుంటే అధికారంలోకి రాకపోవచ్చు. 2029 ఎన్నికల నాటికి టీడీపీ మరింత బలహీనమవుతుంది. అప్పుడు పదేళ్ల వైసీపీ పాలనపై అసంతృప్తి పెరిగి తమకు అడ్వాంటేజీ అవుతుందన్న భావన కూడా పవన్ లో ఉందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అందుకే పొత్తులపై ఇప్పుడిప్పుడే నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తే ఓకే. లేకుంటే టీడీపీని ఒంటరిగా వదిలేస్తారు తప్పించి, బీజేపీని మాత్రం వదిలేయరన్నది ఆ పార్టీ ముఖ్యుల నుంచి అందుతున్న సమాచారం. మొత్తం మీద వచ్చే ఎన్నికల్లో చివరి నిమిషంలో ఏదైనా మ్యాజిక్ జరగవచ్చేమో కాని, ఇప్పటి వరకూ ఉన్న పరిస్థితి ప్రకారం ఏపీలో వచ్చే ఎన్నికల్లో ట్రయాంగల్ ఫైట్ తప్పదన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా.

# ప్రకాశంలో కనిపించని రామనాథం

ఒంగోలు,జూలై 27, బాపట్ల జిల్లాలోని పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇంఛార్జ్‌గా ఉన్నారు రావి రామనాథం బాబు. 2014 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీచేసిన గొట్టిపాటి భరత్ కుమార్ ఓడిపోవడం.. అప్పట్లో అద్దంకిలో వైసీపీ నుంచి గెలిచిన గొట్టిపాటి రవికుమార్ టీడీపీలోకి వెళ్లడంతో భరత్ సైలెంట్ అయ్యారు. దాంతో వైసీపీ అధిష్ఠానం రావి రామనాథం బాబును పర్చూరు ఇంఛార్జిగా నియమించింది. 2019 ఎన్నికల్లో చివరి నిమిషంలో దగ్గుబాటి వెంకటేశ్వరరావు వైసీపీ టికెట్ ఇచ్చారు. దాంతో అలిగిన రామనాథంబాబు టీడీపీలో చేరారు. ఆ ఎన్నికలు ముగిసి ఏడాది గడవక ముందే ఏర్పడిన రాజకీయ పరిస్థితుల్లో దగ్గుబాటి సైలెంట్ అయ్యారు. టీడీపీకి గుడ్‌బై చెప్పి రావి తిరిగి వైసీపీలోకి రావడం.. ఇంఛార్జ్ కావడం చకచకా జరిగిపోయింది. కానీ.. స్థానిక వైసీపీ నేతలు మాత్రం ఆయన్ని ఓన్ చేసుకోవడం లేదు. టీడీపీలో చేరి ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తి పెత్తనం ఏంటనేది వారి ప్రశ్న. ఈ వివాదాలు శ్రుతిమించడంతో.. వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుందని అభిప్రాయ పడిన వైసీపీ అధిష్ఠానం పర్చూరు ఇంఛార్జ్‌ను మార్చాలనే నిర్ణయానికి వచ్చింది. ఇదే మరోసారి పర్చూరు వైసీపీని డైలమాలో పడేసింది. సీనియర్ నేత గాదె వెంకటరెడ్డి కుమారుడు గాదె మధుసూదన్‌రెడ్డిని ఇంఛార్జ్‌గా నియమించాలని అనుకున్నారట. అయితే సామాజిక సమీకరణాల కూర్పులో భాగంగా.. కాపులకు ఆ సీటును కేటాయించాలని భావించారట. చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను పర్చూరు నుంచి పోటీ చేయాలని కోరడం.. ఆయన తిరస్కరించడం.. తర్వాత కొన్ని షరతులతో బాధ్యతలు తీసుకునేందుకు ముందు రావడం జరిగిందని టాక్. ఈ పరిణామాలు రామనాథంబాబుకు రుచించలేదని సమాచారం. అధిష్ఠానం ఏదో ఒక ప్రకటన చేసేవరకు కామ్‌గా పార్టీ పనిచేసుకుంటే మంచిదని నిర్ణయించారు రామనాథంబాబు. పార్టీ కోసం తిరుమలకు పాదయాత్ర చేశారు. గడప గడపకు మన ప్రభుత్వంలో చురుకుగా పాల్గొంటున్నారు. అయితే పర్చూరు ప్లీనరీ విషయంలో అనుకున్నంతగా సక్సెస్ కాలేదట. ఇటీవల కాలంలో నియోజకవర్గాలపై పూర్తిస్థాయిలో వైసీపీ అధిష్ఠానం ఫోకస్ పెడుతోంది. ఆ క్రమంలో పర్చూరు సమస్యను కొలిక్కి తెచ్చి గాడిలో పెట్టాలని చూస్తున్నారట. పర్చూరు ఇంఛార్జ్‌గా ఎవరిని పెడితే బాగుంటుందో అని మరోసారి చర్చ జరిగిందట. కాపు సామాజికవర్గానికే ఇంఛార్జ్ పదవి ఇస్తే కలిసి వస్తుందని వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి పలువురి పేర్లను సిఫారసు చేశారట.

# ఉత్తరాంధ్రలో 28 చోట్ల టీడీపీ బలం

విశాఖపట్టణం, జూలై 27 వెంటనే ఎన్నికలు వచ్చే పరిస్థితి లేకపోయినా.. నేతల పర్యటనలు, ప్రకటనలు చూస్తేంటే.. ఎన్నికలు వచ్చినట్టుగానే ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు కనిపిస్తున్నాయి.. అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓవైపు.. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మరోవైపు.. ఇక, జనసేన, బీజేపీ, వామపక్షాలు.. ఇలా ఎవరి వ్యూహాల్లో వారు మునిగిపోయారు.. అయితే, ఉత్తరాంధ్రలో కొత్త వ్యూహాన్ని అమలు చేయబోతున్నామని తెలిపారు టీడీపీ సీనియర్ నేత, ఉత్తరాంధ్ర ఇంఛార్జ్ బుద్దా వెంకన్న? విశాఖపట్నంలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన పార్టీ ముఖ్య నేతల సమావేశంలో పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమనే సంకేతాలు ఇచ్చారు.. ధన దాహం వున్న రాక్షసుడు జగన్? అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై మండిపడ్డ ఆయన.. రానున్న ఎన్నికల్లో జగన్ ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇక, ఉత్తరాంధ్రలో కొత్త వ్యూహాన్ని అమలు చేయబోతున్నాం.. ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల్లో 28 చోట్ల తెలుగుదేశం పార్టీ బలంగా ఉందని వ్యాఖ్యానించారు. ఎవరికి అన్యాయం జరిగినా ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేస్తామని తెలిపారు బుద్దా వెంకన్న.. ఎవరైతే ప్రశ్నిస్తున్నారో వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు.. ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు.. సీఎం జగన్‌పై రాష్ట్రంలోని రూ. 2వేల నోట్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ కి వెళ్తున్నాయని సంచలన ఆరోపణలు చేశారు వెంకన్న.. అయితే, జగన్ కు ఎలాంటి ప్రణాళికలు లేకపోవడం వల్లే వరదల రూపంలో ఇలాంటి ప్రమాదం వచ్చిందని విమర్శించారు మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప.. జగన్ తో ఎలా మాట్లాడాలో మంత్రులు ప్రజలకు ట్రైనింగ్ ఇస్తారా?? అని ఎద్దేవా చేశారు. విపత్తు సహాయక నిధులు అడ్డగోలుగా మళ్లించేశారని ఆరోపించారు. మరోవైపు.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మేం సిద్దంగా వున్నామని ప్రకటించారు మాజీ మంత్రి కళా వెంకట్రావు? రైతులకు 10 బస్తాల విత్తనాలు ఇవ్వాల్సిన చోట ఒక బస్తా ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. నీరో చక్రవర్తి మాదిరి తాడేపల్లిలో వుంటున్నారు.. అంటూ సీఎం జగన్‌పై ఫైర్ అయ్యారు.. పోలవరం నిర్వాసిత గ్రామాల ప్రజలు తిరిగి తెలంగాణకు వెళ్లిపోతామనడం ప్రభుత్వానికి సిగ్గు చేటు అని మండిపడ్డారు.. అభివృద్ధి, సంక్షేమం ఏరకంగా వుందో అనడానికి ఇదే నిదర్శనంగా తెలిపారు కళా వెంకట్రావు.

# తానేటి వనితకు చేదు అనుభవం

గుంటూరు, జూలై 27,హోం మంత్రి తానేటి వనితకు చేదు అనుభవం ఎదురైంది. ఆమె సొంత నియోజకవర్గమైన కొవ్వూరులో అర్బన్ బ్యాంక్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అధికార వైఎస్సార్సీపీ అభ్యర్థులెవరూ పోటీలో కనిపించలేదు. 11 డెరెక్టర్ స్థానాలను టీడీపీ బలపర్చిన అభ్యర్థులు ఏకగీవ్రంగా గెలుపొందారు. నూతన డైరెక్టర్లంతా కలిసి టీడీపీ నాయకుడు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు మద్దిపట్ల శివరామకృష్ణను ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. దీంతో మద్దిపట్ల శివరామకృష్ణ వరుసగా ఐదోసారి బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే నాలుగుసార్లు టీడీపీకి చెందిన మద్దిపట్ల.. బ్యాంక్ చైర్మన్‌గా వ్యవహరించడంతో.. ఈ సారి ఎలాగైనా ఆయన్ను ఓడించాలని హోం మంత్రి తానేటి వనిత ముందుగానే పార్టీ శ్రేణులకు సూచించింది. త్రీమాన్ కమిటీ ద్వారా ఎన్నికలు వాయిదా వేసే ప్రయత్నాలు కూడా జరిగాయి. కానీ టీడీపీ నాయకుల వ్యూహాలను పసిగట్టడంలో హోంమంత్రి వనిత విఫలమయ్యారు. ఇటీవల తిరుపతి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో గెలిచిన తరహాలోనే ఈ ఎన్నికల్లోనూ గెలుస్తామని వైఎస్సార్సీపీ భావించింది. కానీ అలా జరగకపోవడంతో.. కొవ్వూరు అర్బన్ బ్యాంక్ ఎన్నికల వ్యవహారంపై పార్టీ అధిష్టానం ఆరా తీసిందని సమాచారం. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో తానేటి వనిత కొవ్వూరు నుంచి 25 వేల మెజార్టీతో గెలుపొందడం గమనార్హం.



# లాభాలు ఉన్నా... ప్రైవేటే

విశాఖపట్టణం, జూలై 27, ప్రవేటీకరణ కేంద్రం పాలసీ అని మరో సారి తేలిపోయింది. ప్రభుత్వ రంగ సంస్థలపై ప్రై 'వేటు' వేయడమే తమ విధానమని కేంద్రం పార్లమెంటు సాక్షిగా అంగీకరించేసింది. ప్రభుత్వ రంగ సంస్థలు లాభాలలో ఉన్నా వాటిని ప్రైవేటుకు అప్పగించేసి డబ్బులు దండుకోవడమే లక్ష్యమని తేల్చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలోనే నడుస్తోందని అంగీకరించింది. అయినా సరే విశాఖ ఉక్కును ప్రైవేటుకు అప్పించడానికి నిర్ణయించేశామనీ, ఆ నిర్ణయంలో మార్పు ఉండదనీ తేల్చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కు 2021-22 ఆర్థిక సంవత్సరం లో 913.19 కోట్ల రూపాయల లాభం వచ్చిందని కేంద్రం పార్లమెంటు సాక్షిగా ప్రకటించింది. తెలుగుదేశం ఎంపీ కనకమేడల అడిగిన ప్రశ్నకు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో విశాఖ ఉక్కు కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాభాలు వచ్చాయని పేర్కొన్నారు. అయినా సరే విశాఖ స్టీల్ ను ప్రైవేటు పరం చేయడానికే కట్టుబడి ఉన్నామని ఆయన చెప్పారు. కార్మికులు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నా కేంద్రం ఖాతరు చేయడం లేదు. రాష్ట్రం మొక్కుబడిగా ప్రైవేటీకరణ వద్దని ఓ లేఖ రాసేసి చేతులు దులిపేసుకుంది. అయితే కేంద్రం మాత్రం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించాలన్న విధానానికి కట్టుబడి విశాఖ ఉక్కును ప్రైవేటుకు అప్పగించేయడానికే సిద్ధ పడుతోంది. పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగానే విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేస్తున్నామని చెప్పింది.

## సర్కారీ స్కూల్లో ఐఏఎస్ బిడ్డ

శ్రీకాకుళం, జూలై 27,ఏపీ ఐఏఎస్ ఆఫీసర్ బి.నవ్య తన కుమారుణ్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నలుగురికీ ఆదర్శంగా నిలిచారు. తాను కూడా గవర్నమెంట్ ఎయిడెడ్ స్కూల్లోనే చదువుకొని ఐఏఎస్ అధికారిణి అయ్యానని గుర్తు చేసుకున్నారు. నవ్య శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ (ఐటీడీఏ) ప్రాజెక్ట్ ఆఫీసర్(పీవో)గా పనిచేస్తున్నారు. ఆమె కుమారుడు బి.శ్రీకర్ ప్రతిక్ ఆరో తరగతి చదువుతున్నాడు. అతణ్ని నవ్య.. మల్లి ప్రాంతంలో ఉన్న గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించారు నవ్య మాట్లాడుతూ ఏపీ సర్కారు విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవటానికి కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయని అన్నారు. గవర్నమెంట్ బడులు ప్రైవేట్ స్కూల్స్‌కి ఏమాత్రం తీసిపోవని పేర్కొన్నారు. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, అన్ని చోట్లా ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని వెల్లడించారు. సీతంపేట మండలంలో ప్రైవేట్ స్కూల్స్ లేవని, 40 కిలో మీటర్ల దూరంలోని పాలకొండ మండలంలో ఉన్నాయని నవ్య చెప్పారు.నిత్యం 40 కిలోమీటర్లు వెళ్లటం, రావటం ఇబ్బందని, అందుకే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించానని ఆమె వివరించారు. పిల్లల్ని ప్రైవేట్ స్కూల్స్‌లో జాయిన్ చేయించేందుకు మధ్య తరగతి కుటుంబాల పేరెంట్స్ సైతం పోటీపడుతున్న ఈ రోజుల్లో ఐఏఎస్ ఆఫీసర్ తన కుమారుణ్ని సర్కారు బడిలో జాయిన్ చేయించటం నిజంగా అభినందించదగ్గ విషయమని పలువురు ప్రశంసిస్తున్నారు. నవ్య తలచుకుంటే తన కొడుకుని ఏ కార్పొరేట్ స్కూల్లోనో చేర్పించగలరు. కానీ ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించి ఉచితంగా చదువు చెబుతున్నప్పుడు లక్షలు ఖర్చు చేయటం దేనికి అనేది ఆమె ఉద్దేశంగా కనిపిస్తోంది.సాక్షాత్తూ ఒక ప్రభుత్వ అధికారిణి అయుండి ఆ ప్రభుత్వ బడి పైనే నమ్మకం ప్రదర్శించకపోతే ఎలా?. ఆర్థిక స్తోమత అనే సంగతిని పక్కన పెట్టి అసలు ఆ స్కూల్లో మంచిగా చదువు చెబుతున్నారా లేదా అనేది చూడాలి. నిజం చెప్పాలంటే ప్రైవేట్ స్కూల్లో కన్నా గవర్నమెంట్ బడిలోనే ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు ఉంటారు. కాకపోతే పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి వచ్చాక వాళ్లతో రెగ్యులర్‌గా హోం వర్క్ చేయిస్తూ అర్థంకాని విషయాలేమైనా ఉంటే వాటిని తల్లిదండ్రులు వివరిస్తే సరిపోతుంది. ఈ మాత్రం దానికి ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌కి పంపించాల్సిన అవసరం లేదు అని నిపుణులు సూచిస్తున్నా

## నేడు ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

ప్రతి ఏడాది జూలై 28 వ తేదిన ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటారు. మన జీవితంలో ప్రకృతి ప్రాముఖ్యతను, దాన్ని ఎందుకు పరిరక్షించాలో గుర్తుచేసే ముఖ్యమైన రోజు ఈ రోజు. ప్రకృతి పరిరక్షణ గురించి అవగాహన పెంచడానికి, సుస్థిరతను ప్రోత్సహించడానికి ఈ రోజు మనకు అవకాశాన్ని ఇస్తుంది. సహజ వనరులను పరిరక్షించేందుకు ఉత్తమమైన పద్ధతుల గురించి అవగాహన కల్పించడానికి ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడింది. భూమిపై పరిమిత వనరులు ఉన్నందున సమతుల్యతను కాపాడుకోవడానికి వాటిని సమర్థవంతంగా ఉపయోగించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తుంది. జనాభా విస్ఫోటనం సహజ వనరులు చాలా వేగంగా క్షీణించటానికి ఓ ప్రధాన కారణం ఉంది. సాంకేతిక పురోగతి, విలాసవంతమైన జీవనశైలి, గ్లోబల్ వార్మింగ్, ఓజోన్ పొర క్షీణత, ఇటీవలి కాలంలో అమెజాన్ అడవుల్లో చెలరేగిన మంటలు వంటివి పర్యావరణ సమస్యలను లేవనెత్తుతున్నాయి. భవిష్యత్తులో బాధపడకుండా ఉండాలంటే ప్రకృతి సమతుల్యత కోసం వీటిని పాటించాలి. – ఆహార, నీటి వృథాను అరికట్టడం– రోజువారి కార్యకలాపాల్లో కాలుష్యాన్ని పెంపొందించే వాటిని నిరుత్సాహపరచడం – పనిలో లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు, ఎయిర్ కండిషనర్‌లను బంద్ చేయడం – దంతాలను, చేతులను శుభ్రపరుచుకునేప్పుడు నల్లాలను అనవసరంగా తిప్పి ఉంచకుండా ఉండి నీటి వృథాను అరికట్టడం. మన దైనందిన జీవితంలో ఇటువంటి చిన్న చిన్న పనులను ఆచరించడం వల్ల ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవడంలో సహాయం పడినవాళ్లమౌతాం. సమీప భవిష్యతుల్లో ఎదురయ్యే ఎటువంటి ప్రకృతి విపత్తుల నుంచైనా మానవాళిని రక్షించుకోవచ్చు. అందుకు కుటుంబ సభ్యుల్లో సైతం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రకృతిని రక్షించడానికి, పరిరక్షించడానికి స్థిరమైన జీవనశైలిని ఆచరించడం.

## ఏపీఎస్ ఆర్టీసీలో ఇకపై మహిళా డ్రైవర్లు

అమరావతి జూలై 27 ఏపీఎస్‌ఆర్టీసీలో ఇప్పటి వరకు మహిళా కండక్టర్లను చూసిన మనం ఇకపై వారిని డ్రైవర్లుగానూ చూడబోతున్నాం. ఆ దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకు అనుగుణంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక కసరత్తు మొదలెట్టారు. రాష్ట్రంలోని ఎస్సీ మహిళలకు బస్సు డ్రైవర్లుగా శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికను తయారుచేశారు.సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా శిక్షణ పొందే అభ్యర్థులను ఎంపిక చేసేందుకు త్వరలో మార్గదర్శకాలను విడుదల చేయనున్నారు. దీనిపై ఇప్పటికే 13 ఉమ్మడి జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)లకు ప్రాథమికంగా ఆదేశాలిచ్చారు. పదో తరగతి పాసైన వారు శిక్షణకు అర్హులు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హులను ఎంపిక చేస్తారు. వారికి ఉమ్మడి జిల్లాల్లోని అందుబాటులో ఉన్న ఆర్టీసీ డ్రైవింగ్ స్కూళ్లలో 32 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఆర్టీసీ బస్సుపైనే శిక్షణ ఇవ్వడంతో వారికి డ్రైవింగ్‌లో మరిన్ని మెలకువలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఈ శిక్షణ ఇచ్చినందుకు గాను ఆర్టీసీకి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం నగదు చెల్లిస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా అభ్యర్థులకు ఆర్టీసీలోనే డ్రైవర్‌గా పోస్టింగ్ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డ్రైవింగ్‌లో శిక్షణతో పాటు మహిళలకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పిస్తారు. వారిలో అర్హత, నైపుణ్యాన్ని బట్టి తొలి దశలో ఆర్టీసీలో ఖాళీగా ఉన్న ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టుల్లో నియమించేందుకు ప్రతిపాదించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మహిళలకు పదవులు, నామినేటెడ్ పనులు, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో అగ్రపీఠం వేస్తున్నారు. ఆయన స్ఫూర్తితో ఎస్సీ మహిళలకు డ్రైవింగ్ శిక్షణ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అర్హుల ఎంపిక కోసం అవసరమైన ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. ఎంపికైన ఎస్సీ మహిళలకు ఆర్టీసీ ద్వారా భారీ వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలను తొలి దఫా ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 310 ఎస్సీ బ్యాక్‌లాగ్ డ్రైవర్ పోస్టుల్లో నియమించేలా ప్రభుత్వానికి నివేదిన్చానున్నారు.

# కూతురు కోసం విజయమ్మ



హైదరాబాద్, జూలై 27, (న్యూస్ పల్స్)వైసీపీ గౌరవాధ్యక్ష పదవి నుంచి విజయమ్మ వైదొలిగిన అనంతరం ఆమె పూర్తిగా తన కుమార్తె తెలంగాణలో ఏర్పాటు చేసిన వైఎస్సార్టీపీకి ఆమె పరిమితమయ్యారు. అదీ ఆ పార్టీ ప్లీనరీ వేదికగాపై నుంచి రాజీ నామా చేస్తున్నట్లు గౌరవంగా ప్రకటించారు. మరోవైపు పక్క రాష్ట్రంలో తన కుమార్తె, వైయస్ఆర్ తెలం గాణ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఒంటరిపోరాటం చేస్తుంది.. ఆమెకు అండగా ఉండాలనుకొంటు న్నట్లు ఆమె ఇదే వేదికపై నుంచి చెప్పుకొచ్చారు. అయితే తాజాగా జులై 25న వైయస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల.. ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ...రాజశేఖరరెడ్డిగారి భార్య విజయమ్మ.. .అలాంటి విజయమ్మగారికి ఏ పదవి ఇచ్చినా తక్కువే అవుతోంది. పదవి ఆశించకుండా... రాజశేఖరరెడ్డిగారి సంక్షేమ పాలన మళ్లీ రావాలని నేను పని చేస్తానని చెప్పిన గొప్ప మనిషి విజయమ్మ... పదవులతో సంబంధమే లేదంటూ పేర్కొన్నారు. తాజాగా వైయస్ షర్మిల చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేస్తున్నాయి. అయితే వైయస్ షర్మిల వ్యాఖ్యలతో.. తెలంగాణలో తన కుమార్తె స్థాపించిన వైయస్ఆర్‌టీపీకి గౌరవాధ్య క్షురాలిగా ఇకపై వైయస్ విజయమ్మ కొనసాగవచ్చుననే ఊహాగానాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తన కుమారుడు వైయస్ జగన్‌ను.. అధికారంలోకి తీసుకు వచ్చేందుకు.. ఓ తల్లిగా వైయస్ విజయమ్మ, సోదరిగా వైయస్ షర్మిల పడిన కష్టం ప్రతి ఒక్కరికి తెలిసేందే. అలాగే తెలంగాణలో కూడా తన కుమార్తె వైయస్ షర్మిలకు అధికారం అందేలా తాను సహకరిస్తే.. సరిపోతోందనే ఓ ఆలోచన వైయస్ విజయమ్మ ఉన్నట్లు ఆమె కుమార్తె వైయస్ షర్మిల వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోందనే ఓ టాక్ అయితే సోషల్ మీడియాలో నడుస్తోంది.మరోవైపు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరి వేదికగా జగన్ పార్టీకి రాజీనామా చేసే క్రమంలో వైయస్ విజయమ్మ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో ట్రోల్ అవుతున్నాయి. కష్టాల్లో ఉన్న తన కొడుకు వైయస్ జగన్‌కు అండగా ఉన్నాను.. ఇప్పుడు నా కూతురు కష్టాల్లో ఉంది... కాబట్టి ఆమెతో పాటు ఉండేందుకు వెళ్తున్నానంటూ విజయమ్మ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో వైరల్ అవుతు న్నాయి. అలాగే లక్షల కోట్ల ఆస్తులున్న వైయస్ జగన్, వైయస్ షర్మిలలు ఏ రకంగా.. ఏ రకమైన కష్టాల్లో ఉన్నా రంటూ వైయస్ విజయమ్మను సోషల్ మీడియా సాక్షిగా నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. జగన్ వద్ద లక్ష కోట్లు ఉన్నాయంటూ ఓ వైపు ప్రచారం అయితే మోత మోగిపోతోంది. ఆ లెక్కన చూస్తే.. మహానేత వైయస్ఆర్ తనయ ఏపీ సీఎం వైయస్ జగన్ సోదరి వైయస్ షర్మిల వద్ద ఓ 10 వేల కోట్ల రూపాయిలు అయినా ఉంటాయని.... పోనీ కనీసంలో కనీసంగా వెయ్యి కోట్లు అయినా ఉంటాయని.. వాటితో ఈ భూమండలం మీద ఏ దేశంలో అయినా సుఖంగా సౌఖ్యంగా బతికేయొచ్చంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.మరి అలాంటి వైయస్ షర్మిల.. ఎలాంటి కష్టంలో ఉందని వారు వైయస్ విజయమ్మను సోషల్ మీడియా సాక్షిగా ప్రశ్నిస్తున్నారు. అయితే విజయమ్మ మాటలను బట్టి చూస్తే.. ఓ ముఖ్యమంత్రి పదవో లేక.. మంత్రి పదవో.. లేక పెద్దల సభ రాజ్యసభో.. లేక ఇంకేదైనా పదవో లేకపోవడమే వైయస్ షర్మిలకు కలిగి న కష్టమా అంటూ వైయస్ విజయమ్మని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. గతంలో వైయస్ జగన్ ఆంధ్రప్రదేశ్ లో రాజన్నరాజ్యం తీసుకు వస్తాడంటూ గతంలో ఓ తల్లిగా.. ఓ చెల్లిగా అతడి కోసం ఎన్నికల్లో ప్రచారం చేశారని.. ఆ తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలిసిందేనని ఆ విషయం మీరు బయటకు చెప్పక పోయి నా.. మీ మనసాక్షిగా తెలుస్తునే ఉంటుందని వారు సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నా రు.ఆ క్రమంలోనే మీరు.. ఆ పార్టీ గౌరవాధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి ఉంటారని నెటిజన్లు సోషల్ మీడియాలో అభిప్రాయపడుతున్నారు. ఇక తెలంగాణలో కూడా రాజన్న రాజ్యం తెచ్చి తెలంగాణ ప్రజల కష్టాలు తీరుస్తానని వైయస్ఆర్ టీపీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల చెబుతున్నారని.. మరోవైపు మీరు ప్లీనరీ వేదికగా వైయస్ షర్మిల కష్టాల్లో ఉందంటూ మీరు లక్షలాది మంది హాజరైన ప్రజల ముందు చెప్పారని.. మరి వైయస్ షర్మిలే ప్రస్తుతం కష్టాల్లో ఉంటే.. ఇక తెలంగాణ ప్రజల కష్టాలను ఆమె ఎలా తీరుస్తోందంటూ నెటిజన్లు సోషల్ మీడియా సాక్షిగా వ్యంగ్యంగా విమర్శ నాస్త్రాలు సంధిస్తున్నారు. ఏపీలో వైయస్ జగన్‌ని అధికారంలోకి తీసుకు వచ్చే వరకు వీరిద్దరు శ్రమించి.. మూడేళ్ల జగన్ పాలనలో ప్రజలు ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా కనీసం వీరిద్దరు ఆరా కూడా తీయడం లేదనే విమర్శ సైతం తెలుగు రాష్ట్ర ప్రజల్లో బలంగా ఉందనే చర్చ అయితే చాలా బలంగా సాగుతోంది. ఇక వైయస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల.. హైదరాబాద్‌లో ఎప్పుడు ప్రెస్‌మీట్ పెట్టినా.. ఏపీలో జగన్ పాలనపై విలేకర్లు ఏమైనా ప్రశ్నలు సంధిస్తే.. ఆమె కప్పదాటు ధోరణితో వ్యవహరిస్తారని ఓ టాక్ అయితే సోషల్ మీడియాలో రంజు రంజుగా నడుస్తోంది

# అడ్డు అదుపులేని చౌక బియ్యం అక్రమ రవాణా



**బస్తాల కొద్దీ అక్రమాలు**

**రెండు రోజుల క్రితమే 10 లక్షల రూపాయలు విలువచేసే చౌక బియ్యం పట్టివేత**

**అధికారుల అండతో పేదల బియ్యం పెద్దల పరం**

**బద్వేలు అడ్డా గా చౌక బియ్యం రవాణా రాకె**

బద్వేలు ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న చౌక బియ్యం అధికారుల అండతో పెద్ద మొత్తంలో నల్లబజారుకు తరలిపోతుంది తాజాగా మూడు రోజుల క్రితం బద్వేలులో కడప విజిలెన్స్ ఇన్ ఫోర్స్ మెంట్ అధికారులు దాదాపు 20 లక్షల రూపాయలు విలువచేసే చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు తాజాగా 2 రోజుల క్రితం కడప ఎన్ ఫోర్స్ మెంట్ విజిలెన్స్ అధికారులు దాదాపు 10 లక్షల రూపాయలు విలువచేసే 645 బత్తల చౌక బియ్యం స్వాధీనం చేసుకున్నారు రెండు వాహనాలు సీజ్ చేశారు ఐదు మంది పై పోలీసులు కేసు నమోదు చేశారు చౌక బియ్యం ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించే విషయములో కొందరు అధికారులు స్మగ్లర్లకు అన్ని విధాల సహకరించడమే కాకుండా తరలింపు విషయంలో కీలకపాత్ర పోషిస్తున్నారు బద్వేలు కేంద్రంగా చౌక బియ్యం పక్కదారి పడుతుంది చౌక బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు పొరుగు రాష్ట్రాలకు తరలించి స్మగ్లర్లు ప్రతి నెల పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు గత కొన్ని సంవత్సరాలుగా ఈ వ్యవహారం నడుస్తుంది సంబంధిత అధికారులకు అన్ని విషయాలు తెలిసి కూడా నెలవారి మూడు పులు వస్తుండడంతో వారు ఆ ముడుపులతో ఖుషి చేసుకుంటున్నారు ఇది కూడా అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం బద్వేలు కేంద్రంగా దాదాపు 50 మందికి పైగా చౌక బియ్యం స్మగ్లర్లు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు అంటే ఈ విషయంలో వారు ఎంత సిద్ధహస్తులో చెప్పకనే తెలిసిపోతుంది పేదల బియ్యం తరలిస్తున్న ది ఎవరు అనే విషయం సంబంధిత అధికారులకు పూర్తిగా తెలుసు కానీ ఏమాత్రం పట్టించుకోరు ఏ సమయములో చౌక బియ్యాన్ని ఎక్కడికి తరలిస్తున్నారు తరలిస్తున్న వాహన నెంబర్ తో పాటు అధికారులకు బాగా తెలుసు అయినా వారు తమకేమీ తెలియనట్లుగానే ప్రవర్తిస్తారు చౌక బియ్యం ఎక్కడ పట్టుబడిన వాటి మూలాలు బద్వేల్ లో ఉన్నాయంటే ప్రతి నెల ఏ స్థాయిలో చౌక బియ్యం అక్రమంగా రవాణా జరుగుతుంది అనే విషయం అందరికీ తెలిసిపోతుంది బద్వేలు స్టాక్ పాయింట్ నుంచి దాని పరిధిలోని మండలాలకు బియ్యం రవాణా జరుగుతూ ఉంటుంది చౌక డిపోలకు చేరకముందే బియ్యాన్ని తాము ఏర్పాటు చేసుకున్న వాహనంలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు సమయం లేనప్పుడు చౌక బియ్యాన్ని కొన్ని రోజుల పాటు నిల్వ ఉంచేందుకు ప్రవేట్ గోదాములు ఏర్పాటు చేసుకుంటున్నారంటే వారి నెట్వర్క్ ఏ స్థాయిలో ఉందో చెప్పకనే తెలిసిపోతుంది ప్రైవేట్ గోదాముల గురించి అధికారులకు తెలియదు అంటే నమ్మశక్యం కావడం లేదు వారి ప్రైవేట్ గోదాముల విషయం అధికారులకు స్పష్టంగా తెలుసు అయినా పట్టించుకోరు గతములో బద్వేలు స్టాక్ పాయింట్ లో పనిచేసిన ఒక అధికారి నేరుగా స్మగ్లర్లు ఏర్పాటుచేసిన వాహనంలో బియ్యం ఎక్కిస్తూ ఉన్నత అధికారులకు పట్టుబడ్డాడు బియ్యం రవాణా చేస్తున్నవారే ఉన్నతాధికారులతో మాట్లాడి వారడిగిన మూడుపులు భారీ మొత్తములో అందించి గోదాము అధికారిపై చర్యలు తీసుకోకుండా తిరిగి అదే అధికారిని ఇక్కడికి తెచ్చుకున్నారు గోదాములో ఉన్న కొందరు ప్రవేట్ వ్యక్తుల ద్వారా ఈ తతంగమంతా నడుస్తున్నట్లు మొదటినుంచి ఆరోపణలు ఉన్నాయి ఇటీవల జరిగిన బద్వేలు ఉప ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున చౌక బియ్యం ఇతర నిత్యవసర వస్తువులు నల్లబజారుకు ప్రైవేట్ వ్యక్తుల ద్వారాతరలించారు ఈ విషయాన్ని కొందరు వ్యక్తులు రెవెన్యూ అధికారులకు రిపోర్టు చేసిన ప్రయోజనం లేకుండా పోయింది తాము ఎన్నికల్లో బిజీగా ఉన్నామని ఆ ఫిర్యాదును పక్కన పెట్టారు దీంతో స్మగ్లర్లు మరింత రెచ్చిపోయారు రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు లు అడ్డం పెట్టుకొని రెవెన్యూ సిబ్బంది కొంతమంది స్మగ్లర్లను బాగా బెదిరించి పెద్ద మొత్తంలో ముడుపులు దండుకున్నారు చౌక బియ్యాన్ని స్మగ్లర్లు కొన్ని చౌక డిపోల వద్ద 15 రూపాయల ప్రకారం కొనుగోలు చేసి వాటిని తమ సొంత గోదాముల్లో దాచి ఉంచుతాను అదను చూసి అక్రమ రవాణా చేస్తూ ఉంటారు ఇది కూడా అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం ఇంకో విషయం ఏమంటే స్మగ్లర్లు అన్ని రాజకీయ పార్టీలతో మంచి సంబంధాలు కలిగి ఉంటారు ఎక్కువ శాతం బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తుండగా మిగిలిన బియ్యాన్ని ముందుగానే ఒప్పందం చేసుకున్న రైస్ మిల్లులకు తరలించి అక్కడ పాలిష్ పట్టి బహిరంగ మార్కెట్లో అమ్మకాలు చేస్తుంటారు గతంలో బద్వేలు పట్టణంలో పలు రైస్ మిల్లు లో అధికారులు దాడులు చేసి చౌక బియ్యాన్ని పట్టుకున్న సందర్భాలు లేకపోలేదు ప్రతి నెల రెండు వందల నుంచి 300 క్వింటాలు చౌక బియ్యం స్మగ్లర్ల పరం అవుతుందంటే వారి నెట్వర్క్ ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు

## తుప్పల్లోకి దూసుకెళ్లిన బస్సు..ప్రయాణికులు క్షేమం

తాడేపల్లిగూడెం గోతుల మయంగా ఉన్న రహదారిలో వెళుతున్న ఆర్టీసీ బస్సు స్టీరింగ్ విరిగిపోవడంతో.. అదుపుతప్పి తుప్పల్లోకి దూసుకెళ్లింది. బస్సు తాడేపల్లిగూడెం నుంచి సుమారు 60 మంది ప్రయాణికులతో రావులపాలెం బయలుదేరగా.. జువ్వపాలెం వద్ద రోడ్డుపై గోతులు ఉన్నాయి. వీటిలోంచి వెళుతుండగా బస్సు స్టీరింగ్ ఒక్కసారిగా విరిగిపోయింది. గోతుల మయంగా ఉన్న రహదారిలో వెళుతున్న ఆర్టీసీ బస్సు స్టీరింగ్ విరిగిపోవడంతో అదుపుతప్పి తుప్పల్లోకి దూసుకెళ్లింది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు తాడేపల్లిగూడెం నుంచి సుమారు 60 మంది ప్రయాణికులతో రావులపాలెం బయలుదేరింది. జువ్వపాలెం వద్ద రోడ్డుపై గోతులు ఉన్నాయి. వీటిలోంచి వెళుతుండగా బస్సు స్టీరింగ్ విరిగిపోయింది. అదుపు తప్పి పక్కనున్న ఏలూరు కాలువ వైపు బస్సు దూసుకెళ్తుండగా టైర్లకు మట్టి గుట్టలు అడ్డురావడం, డ్రైవర్ సమయస్ఫూర్తితో బ్రేకులు వేయడంతో తుప్పల్లోకి వెళ్లి ఆగిపోయింది. తృటిలో ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఆర్టీసీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, ప్రయాణికులకు మరో బస్సును ఏర్పాటు చేసి గమ్యస్థానాలకు చేర్చారు.

## వరదనీటిలోపడిన మహిళ..కాపాడిన ఎన్డీఆర్ఎఫ్

విజయవాడపెనుగంచిప్రోలు మునేరు బ్రిడ్జి పై నుండి ఒక మహిల వరదలోకి పడిపోయింది. బ్రిడ్జి పై గేదెల తోడుకుంటూ వెళ్తూ ఉండగా బ్రిడ్జి పై వరద నీటిలో పడింది. అదృష్టవశాత్తు అక్కడే ఎన్డీఆర్ఎఫ్ బృందం ఉండటం తో వారు వెంటనే రంగంలోకి దిగారు. స్థానికులు సహాయంతో మహిళను ప్రాణాలతో ఒడ్డుకు చేర్చారు.

## మైనర్ బాలుడిని కిడ్నాప్ చేసిన వివాహిత

గుడివాడగుడివాడలో 15 ఏళ్ల బాలుడు,30 మహిళ అదృశ్యం కేసును టూ టౌన్ పోలీసులు ఛేదించారు. హైదరాబాద్ బాలానగర్ లోనీ ఒ గదిలో బాలుడు, మహిళను గుర్తించారు. వారిని తీసుకువచ్చి బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారే. వివాహితపై ఫోక్సో యాక్ట్, కిడ్నాప్ కేసుల నమోదు చేసారు. నలుగురు పిల్లలు ఉన్న స్వప్న నెల రోజులుగా బాలుడితో శారీరిక సంబంధం ఏర్పరచుకుందని సీఐ దుర్గారావు వెల్లడించారు. బాలుడుతో శాశ్వతంగా కలిసి ఉండాలనే దురుద్దేశంతో మాయమాటలు చెప్పి అపహరించింది. సంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఇరువురిని గుర్తించామని అయన అన్నారు.

## పశువులతో ట్రాఫిక్ కు అంతరాయం

నూజివీడునూజివీడు పట్టణంలో పశువులు ట్రాఫిక్ కు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. గోవులు, గేదలను పశు పోషకులు, యజమానులు పట్టణంలోని ప్రధాన రహదారులు వదిలేయడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన రహదారుల మధ్యలో గుంపులుగా ఉంటున్న పశువులు వాహనాలకు అకస్మాత్తుగా అడ్డు రావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరించడంతో నూజివీడు పట్టణంలో పశువుల సంచారం ఎక్కువయింది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోడ్లపై పశువులు సంచరించడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మున్సిపల్ అధికారులు యజమానులతో మాట్లాడి సమస్యను పరిష్కరించకపోతే వాహనదారులు మరింత ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని వాపోతున్నారు. ఒక్కొక్క సమయంలో రహదారులపై పశువుల సంచారంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడటంతో అంబులెన్సులు కూడా ముందుకు వెళ్లే అవకాశం లేకుండా పోతుంది. ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని పశువుల సంచారం రహదారిపై లేకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ అందోళన

విజయవాడ ఆర్ఎస్ఎస్, బీజేపీలు దేశాన్ని సర్వ నాశనం చేస్తున్నాయని విజయవాడ సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు ధ్వజమెత్తారు.కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ,రాహుల్ గాంధీలపై నేషనల్ హెరాల్డ్ కేసుల్లో ఈడీ ద్వారా ఇబ్బందులకు గురి చేయడాన్ని మరియు రాహుల్ గాంధీ గారిని అరెస్టుకు నిరసనగా బుధవారం కాంగ్రెస్ శ్రేణులు విజయవాడ లెనిన్ సెంటర్ లో శాంతియుత నిరసన చేపట్టారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపడుతుంటే బీజేపీ నేతలకు వణుకు పుడుతోందన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కావాలని సోనియా, రాహుల్ గాంధీ పేర్లను తెచ్చి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నరహరిశెట్టి నరసింహారావు పేర్కొన్నారు.బీజేపీ ప్రభుత్వం సోనియా,రాహుల్ గాంధీలను ఇబ్బందులకు గురి చేయడం అప్రజాస్వామికమని అన్నారు. దానివల్ల సోనియా గాంధీ కుటుంబానికి నష్టమేమీ లేదన్నారు. ప్రజలు చైతన్యం కావాలని, అభివృద్ధి నిరోధకులుగా మారిన పాలక ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వి. గురునాథం, కిరణ్, సింహాద్రి జగన్నాథం, జోసెఫ్, అప్పలనారాయణ, రమణ, మోహన్, దమ్ము రాజు, కిశోర్, ఇమ్రాన్, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

## సాయిప్రియ క్షేమం..కానీ?ప్రియుడితో జంప్



విశాఖపట్నం విశాఖ ఆర్కే బీచ్లో తప్పి పోయిన వివాహిత సాయి ప్రియ మిస్సింగ్ కేసులో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. 36 గంటలుగా ఆమె కోసం గాలింపు చేపడుతోన్న అధికారులకు దిమ్మతిరిగే వాస్తవాలు తెలిశాయి. సముద్రంలో గల్లంతైందని అందరూ భావిస్తుండగా సాయి ప్రియ చివరికి ప్రియుడితో ఎస్కేప్ అయినట్లుగా అనుమానిస్తున్నారు.ఈ క్రమంలో నెల్లూరులో ఉన్నట్లుగా తెలుస్తోంది.దీనిపై ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.శ్రీనివాస్ హైదరాబాద్లోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తుండడంతో ఈ జంట హైదరాబాద్లో కాపురం పెట్టింది. అయితే పెళ్లి తర్వాత కూడా సాయి పల్లవి రవితో ప్రేమ వ్యవహారాన్ని కొనసాగించింది. నాలుగు నెలల క్రితం కంప్యూటర్ కోర్సు చేయాలంటూ సాయి ప్రియ హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చింది. ఇదే సమయంలో సెకండ్ మ్యారేజ్ డే అని శ్రీనివాస్ ఈ నెల 25న హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చాడు. అదే రోజు సాయంత్రం 5.30 కి భర్త తో కలిసి బీచ్కి వెళ్లిన సాయి ప్రియ, అంతకు ముందే ఆ సమాచారాన్ని ప్రియుడు రవికి చేరవేసింది. శ్రీనివాస్ ఏమరపాటుగా ఉన్న సమయంలో రవితో కలిసి సాయి ప్రియ అక్కడి నుంచి పారిపోయింది. ఇది తెలియని శ్రీనివాస్ తన భార్య తప్పిపోయిందని తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఏకంగా హెలికాప్టర్లతో గాలింపు చర్యలు చేపట్టామని,వీరి ఫోన్ డేటా ఆధారంగా దర్యాప్తు జరుగుతోందని విశాఖ డిప్యూటీ మేయర్ శ్రీధర్ తెలిపారు.

# పంటకు విచక్షణ రహితంగా పురుగుమందులను వాడకండి

## ఆరోగ్యకరమైన పంటను పండించండి. వ్యవసాయ అధికారులు

మంత్రాలయం ( విభారె): పంటకు మోతాదుకు మించి పురుగుమందులను వాడకూడదని పంటకు ఉపయోగపడే మిత్ర పురుగులను అభివృద్ధి చేసుకోవాలని ఆరోగ్యకరమైన పంటలను పండించాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు.మండల పరిదిలోని వి. తిమ్మాపురం గ్రామం లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.పొలంబడి ముఖ్య ఉద్దేశ్యం పైన తెలిపిన వాటితో పాటు పంటను తరుచుగా పరిశీలన చేయుటం్రై తను స్వాంతగా నిర్ణయం తీసుకునే విధంగా తయారు చేయడం గురించి రైతులకు చెప్పడం తెలియజేశారు.పురుగు మందులు విచక్షనా రహితంగా వాడితే వాటి వలన సంబవించే ఫలితాలు మానవులపై ఏ విధంగా ప్రభావం చూపుతుందో బోర్డు పై బొమ్మ రూపం వేసి చుపించి రైతులకు వివరించారు.తరువాత మిత్ర పురుగులైనసాలీడు, అక్షింత పురుగు, గొల్ల భమా, క్రైజో పర్ల, రైతులను గ్రూపులగా చేసి, పొడవైనా లైను తయారు చేసి గ్రూపు వలన కలిసి ఉండే లాభాలు వివరించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారులు నరసింహుడు , రేఖమాధురి,వి ఏ ఏ లు, వి. శ్రీనివాసులు, మదన్ సుభాష్, విజయ్, పొలం సదుపాయకర్త పరుశప్ప, మరియు తిమ్మాపురం గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.





## ఎంపీఎఫ్ సీ గొడౌన్ లకు భూమి పూజ

. మంత్రాలయం ( విభారె) : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మంత్రాలయం నియోజకవర్గంలోని రాంపురం, కందుకూరు, అగసనూరు, జంపాపురం, సాతనూరు, కోసిగి గ్రామాల్లో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఎంపీఎఫ్ సీ గొడౌన్ లు 40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నట్లు వైఎస్సార్సీపీ మండల ఇన్ చార్జ్ ,వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో గోడౌన్ నిర్మాణ పనులకు విశ్వనాథ్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ గోడౌన్ లు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. మిగతా గ్రామాల్లో కూడా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని, మరి కొన్ని గ్రామాల్లో గోడౌన్ లు నిర్మించేందుకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపడం జరిగిందని ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

# పచ్చదనం పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించారు



ఎమ్మిగనూరు . ఎమ్మిగనూరు పట్టణంలో నారాయణ పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ఏ. జి. ఎం రమేష్ కుమార్ గారి ఆధ్వర్యంలో గో - గ్రీన్ అనే కార్యక్రమాన్ని జరుపుకున్నారు.ఇందులో ముఖ్య అతిథిగా హాజరైన మండల వ్యవసాయాధికారి యం.వరప్రసాద్ గారు పచ్చదనం గురించి తెలుపుతూ ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలనీ ,పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా పొల్యూషన్ వ్యాపించదు అని ప్రతి విద్యార్థి ఇంటిదగ్గర ఒక మొక్క నాటాలని అన్నారు పరిశుభ్రత ఉంచుకోవాలని,శుభ్రతను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ ఐ కొండలరావు,పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్, ఏవో జాకీర్ హుస్సేన్ , మరియు పాఠశాల సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## మహమ్మద్ ప్రవక్త జీవిత గాధ పుస్తకాన్ని ఆవిష్కరించిన : ఎమ్మెల్యే శిల్పా రవి కిషోర్ రెడ్డి

నంద్యాల :-నంద్యాల ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి నివాసంలో జమిా అతే ఉలమా నంద్యాల జిల్లా వారి ఆధ్వర్యంలో మహమ్మద్ జీవిత గాధ పుస్తకాన్ని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి చేతులమీదుగా బుధవారం ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ జమిాఅతే ఉలమా వారి ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జీవిత కాదని పుస్తక రూపంలో ఆవిష్కరించడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని ఒక మనిషి జీవితంలో ఎలా నడవాలి నడవడిక ఎలా ఉండాలి అని చెప్పిన మహనీయులు మరి మనిషి ఏ విధంగా జీవించాలి తెలుసుకోవాలంటే మహమ్మద్ ప్రవక్త జీవిత గాధ చదివితే మనకు తెలుస్తుంది అన్నారు. ఈ పుస్తకం కులాలకు మతాలకు సంబంధించినది కాదు అని మనిషి ఎలా జీవించాలో నేర్పించింది ఈ పుస్తకం యొక్క గొప్ప ఉద్దేశం మంచిని పాటించాలని మన దేశానికి మంచి భవిష్యత్తు ఇచ్చే అవకాశం ఉందని ఈ అవకాశం కల్పించినజమిాఅతే ఉలమా సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమిాఅతే ఉలమా సభ్యులు మౌలానా, నాగిని రవి సింగారెడ్డి , వైస్ చైర్మన్ గంగి శెట్టి శ్రీధర్,గన్ని కరీం, కౌన్సిలర్స్ సాధిక్ భాష,చంద్రశేఖర్,మాజీ కౌ న్సలర్స్ జకీర్ హుషేన్,లక్ష్మీ నారాయణ,కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డుకు ఇరువైపులా ఉండే ముళ్ళ పొదలను తొలగించండి

బ్రాహ్మణ కొట్కూరు: నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లాలన్నా కుంట కట్ట రోడ్డు మార్గం, ఈ రహదారిలో వడ్డెమాను, కోళ్లబావాపురం, గ్రామస్తులు, ద్విచక్ర వాహనదారులు ఈ మార్గం గుండా రాకపోకలు జరుగుతున్నాయి. ఈ కుంట కట్ట రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ పొదలు పెరిగి ఉన్నాయి. దీనికితోడు పాములు కూడా సంచరిస్తున్నాయి. ఎల్లప్పుడూ కుంట కట్ట రోడ్డు ప్రజలతో రద్దీగా ఉంటుంది. మొన్న ఈ మధ్యకాలంలో 1.2.3. తరగతులను హై స్కూల్ కు విలీనం చేశారు .ఈ తరగతి చిన్న పిల్లలు కూడా ఈ దారి గుండా హై స్కూల్ కు వెళుతున్నారు. కుంట కట్ట రోడ్డు సాయంకాలం వేళల్లో మందుబాబులకు అడ్డాగా మారింది పై సమస్యలను దృష్టిలో ఉంచుకొని .గ్రామపంచాయతీ వారు రోడ్డుకు ఇరువైపులా ఉండే ముళ్ళ పొదలను తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## ఎమ్మెల్యే డాక్టర్ సుధా

బద్వేలు , రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని ముందుకు నటిస్తున్నాడని, ప్రతి పేదవానికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా అన్నారు. బుధవారం అట్లూరు మండలం లోని ముత్తుకూరు లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని దర్శించి ప్రభుత్వ పథకాలు పొందిన జాబితాను, సంక్షేమ బావుటాను, వివరించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, మహిళాభివృద్ధి,తో పాటు వివిధ రకాల వృత్తిదారులకు స్వయంగా ఆర్థికంగా వారి ఖాతాలోనే నగదు జమ ఒంటి బృహత్తర కార్యాలు చేసిన గొప్ప వ్యక్తి మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఈనాడు రాష్ట్రంలో ఎక్కడ దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా ప్రతి పథకాన్ని ప్రజల కు చేరే విధంగా చర్యలు తీసుకున్నాడని అన్నారు. వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి పథకాన్ని ప్రజలకు తెలియజేస్తూ ప్రజలను చైతన్యవంతుల గా చేసి పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు రెవెన్యూ పనులతో పాటు రెవెన్యూ వ్యవస్థ అందుబాటు లో ఉండేందుకు పంచాయితీ స్థాయిలో గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి అన్ని శాఖల అధికారులను నియమించి ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు చేసి వ్యవస్థ నడిపిస్తున్నారని అన్నారు. ఇన్ని చేసిన జగన్మోహన్ రెడ్డికి మనము ఇచ్చేది ఒక ఓటు అని 2024లో తిరిగి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిమీద ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండలం వైసిపి నాయకులు గోపి రెడ్డి, మాధవ రెడ్డి, అంజలి రామకృష్ణారెడ్డి, ముదుమాల ప్రభాకర్ రెడ్డి, బోళ్ల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు



## రహదారులపై వాహనాలు. రాకపోకలకు అవస్థలు

నంద్యాల:- నంద్యాల పట్టణం రోజురోజుకూ ఎంతో అభివృద్ధి చెందుతోంది. అదే సమయంలో ట్రాఫిక్ ఇక్కట్లు పెరుగుతున్నాయి. ప్రధాన రహ దారులే కాకుండా అంతర్గత వీధుల్లోనూ ఈ సమస్యలు తప్పడం లేదు. పట్టణంలో ప్రధానమైన పద్మావతి రోడ్డుపై వేలాది వాహనాలు రాకపోకలు కొనసాగి స్తుంటాయి. ఈ మార్గంలో వస్త్ర, హోటళ్లు గ్రానైట్ డిపోలు. హాస్పిటల్ . దుకాణదారులు, ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. ఇక్కడకు వచ్చే వినియోగదా రులు ఎక్కువ మంది రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. రహదారి పైనే ద్విచక్రవాహనాలు, కార్లు పెడుతున్నారు. ఇక తాలుకా అపీస్. ట్రెజరీ .సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెళ్లాలంటే హడలెత్తిపోవాల్సిందే. రిజిస్ట్రేషన్లకు వచ్చే వారు తమ వాహనాలు అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. దీంతో రాకపోకలకు అసౌకర్యం కలుగు తోంది. దీంతో తరచూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. . పద్మావతి నగర్ లో కొన్ని చోట్ల సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసి మరి రహదార్లు పైనే పార్కింగ్ చేయిస్తున్నా.. సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.


# నితిన్ – బేబమ్మల మెలోడీ అదిరిందే!

యంగ్ హీరో నితిన్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ పొలిటికల్ డ్రామా 'మాచర్ల నియోజక వర్గం'. బేబమ్మ కృతిశెట్టి కేథరిన్ హీరోయిన్ లు గా నటించారు. శ్రేష్ మూవీస్ బ్యానర్ పై ఎన్. సుధాకర్ రెడ్డి నిఖితా రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పొలిటిక్ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న ఈ మూవీ ద్వారా ఎం.ఎస్. రాజశేఖర్ రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ ఎటాక్ టీచర్ సినిమాపై మంచి బజ్ ని క్రియేట్ చేసింది.ఇటీవల వరుస ఫ్లాపుల్లో వున్న నితిన్ ఈ మూవీపై భారీ ఎక్స్ పెక్టేషన్స్ పెట్టుకున్నాడు. డిఫరెంట్ మేకోవర్ తో సరికొత్త లుక్ తో మాచర్ల నియోజక వర్గ కలెక్టర్ గా పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ టీజర్ అంజలి నితిన్ పై రూపొందించిన జాతర సాంగ్.. ఈ సాంగ్ చివర్లో 'జయం' మూవీలో పాపులర్ అయిన 'రాను రానంటూనే చిన్నదో..' అనే లిరిక్ ని యాడ్ చేయడంతో ఈ పాట మరింతగా నెట్టింట వైరల్ అవుతోంది.ఇదిలా వుంటే నితిన్ కెరీర్ లోనే హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న ఈ మూవీ ఆగస్టు 5న అత్యంత భారీ స్థాయిలో థియేటర్లలోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ ని జోరుగా స్టార్ట్ చేశారు.ఇటీవల అంజలి నితిన్ లపై జాతర నేపథ్యంలో రూపొందించిన 'రారా రెడ్డి.. నేను రెడీ' అంటూ సాగే మాస్ మసాలా లిరికల్ వీడియోని విడుదల చేశారు. తాజాగా హీరో నితిన్ హీరోయిన్ కృతిశెట్టిలపై చిత్రకరించిన మెలోడీ సాంగ్ 'అదిరిందే..' లిరికల్ ని విడుదల చేశారు. ఇది ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన థర్డ్ సాంగ్. మహతి స్వరసాగర్ సంగీతం అందించగా కృష్ణకాంత్ సాహిత్యాన్ని అందించారు. సంజిత్ హెగ్డే ఆలపించారు. క్యాచీ పదాలతో శ్రావ్యమైన మెలోడీగా ఈ పాట సాగుతోంది. ఈ పాటలో హీరో నితిన్ కృతిశెట్టి చాలా కూల్ గా కలర్ ఫుల్ కాస్ట్యూమ్స్ లో కనిపించి తమదైన స్టైల్లో అదిరిందే అనిపించారు. ఇదిలా వుంటే 'మాచర్ల ధమ్కీ' పేరుతో జూలై 26న మరో వీడియోని వదలబోతున్నారు.ఇక ఫైనల్ గా థియేట్రికల్ ట్రైలర్ కి కూడా ముహూర్తం పెట్టేశారు. థియేట్రికల్ ట్రైలర్ ని జూలై 29న రిలీజ్ చేయడానికి ప్లాన్ చేశారు. పవర్ ఫుల్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా రూపొందిన ఈ మూవీలో రాజప్పగా మెయిన్ విలన్ పాత్రలో సముద్రఖని నటిస్తుండగా ఈ మూవీకి ప్రసాద్ మూరెళ్ల ఛాయాగ్రహణం మహతి స్వర సాగర్ సంగీతం డైలాగ్స్ మామిడాల తిరుపతి ఆర్ట్ సాహి సురేష్ ఎడిటింగ్ కోటగిరి వెంకటేశ్వరరావు.




# ఇది మరీ టూమచ్ గా ఉంది లెజెండ్..!

లెజెండ్ శరవణన్ అని పిలువబడే తమిళనాడుకు చెందిన వ్యాపారవేత్త శరవణన్ అరుల్ గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. శరవణన్ స్టోర్స్ కు ఎవరో ఒక స్టార్ ని బ్రాండ్ ప్రచారకర్తగా పెట్టుకోకుండా.. తనే స్వయంగా వ్యాపార ప్రకటనల్లో నటించి సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ ఎదుర్కొన్నాడు. ఇప్పుడు "ది లెజెండ్" అనే చిత్రంతో వెండితెరపై సందడి చేయడానికి వస్తున్నాడు.న్యూ శరవణ స్టోర్స్ ప్రొడక్షన్ లో శరవణన్ స్వీయ నిర్మాణంలో "ది లెజెండ్" చిత్రాన్ని రూపొందించారు. దీనికి జేడీ-జెర్రీ దర్శకత్వం వహించారు. అగ్ర హీరోల సినిమాలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. భారీ బడ్జెట్ తో రూపొందిన ఈ సినిమా కోసం పాపులర్ స్టార్స్ మరియు టాప్ టెక్నీషియన్స్ వర్క్ చేశారు.'ది లెజెండ్' చిత్రాన్ని జూలై 28న పాన్ ఇండియా స్థాయిలో తెలుగు తమిళ మలయాళ కన్నడ హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 2500 పైగా థియేటర్లలో రిలీజ్ అవుతుందని మేకర్స్ ప్రకటించారు. స్టార్ హీరో రేంజ్ లో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్ కూడా అదే విధంగా చేస్తున్నారు.ట్విట్టర్ - ఫేస్ బుక్ - ఇన్స్టాగ్రామ్ లలో లెజెండ్ శరవణన్ ఖాతాలు ఓపెన్ చేయడం కూడా ఒక విశేషంగా ఓ రేంజ్ లో ప్రమోట్ చేస్తున్నారు. 'వెల్కమ్ తలైవార్' అంటూ హ్యాష్ ట్యాగ్స్ తో నానా హడావుడి చేస్తున్నారు. లెజెండ్ ఎంట్రీతో సోషల్ మీడియాకే సరికొత్త వైభవాన్ని తీసుకొచ్చినట్లుగా ఊదర గొట్టడమే మరీ కామెడీగా ఉంది.ఇక సామాజిక మాధ్యమాల్లో అడుగుపెట్టిన వెంటనే ప్రచారం మొదలుపెట్టారు. ఫస్ట్ పోస్ట్ గా సినిమాలోని లెజెండ్ సర్వవేడి అనే పాటని రిలీజ్ చేశారు. ఇప్పటికే విడుదలైన 'ది లెజెండ్' ప్రమోషనల్ కంటెంట్ పై ట్రోలింగ్ జరిగినప్పటికీ.. యూట్యూబ్ లో మంచి వ్యూస్ వచ్చాయి.ఇప్పుడు లేటెస్టుగా వచ్చిన సాంగ్ లో లెజెండ్ ను ఒక వీరుడిగా ప్రెజెంట్ చేశారు. స్టైలిష్ యాక్షన్ తో సూపర్ స్టార్ రజినీకాంత్ రేంజ్ లో ఎలివేట్ చేయడానికి ప్రయత్నం చేశారు. నిర్మాత కూడా తనే కావడం శరవణన్ ఈ సినిమా కోసం డబ్బును నీళ్ళలా ఖర్చు చేశారని ఈ వీడియో చూస్తే అర్థం అవుతుంది.స్టార్ హీరోల సినిమాలకు మ్యూజిక్ అందించే హారీష్ జయరాజ్.. అందుకు ఏమాత్రం తగ్గకుండా లెజండ్ కు అద్భుతమైన ఆర్ ఆర్ కంపోజ్ చేశారు. వేల్ రాజా సినిమాటోగ్రఫీ బాగుంది. ఇకపోతే ఈ సినిమాలో శరవణన్ సరసన అందాల భామ ఊర్వశి రౌతేలా హీరోయిన్ గా నటించింది. సుమన్ - ప్రభు - నాజర్ - విజయ్ కుమార్ - వివేక్ - గీతిక - లత - కోవైసరళ - యోగిబాబు తదితరులు కీలక పాత్రలో నటించారు.హీరోయిన్ - మ్యూజిక్ - మేకింగ్ క్వాలిటీ - విజువల్స్. ఇలా అన్ని అంశాలు చాలా కాస్ట్లీ గానే ఉన్నాయి. మన లెజెండ్ డెబ్యూ సినిమాకే బలమైన కథని ఎంచుకున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థం అవుతుంది. తొలి సినిమాతోనే పాన్ ఇండియా స్థాయిలో ఇంపాక్ట్ క్రియేట్ చేయాలని లెజెండ్ స్ట్రాంగ్ గా ఫిక్స్ అయినట్లు అర్థం అవుతోంది. ఎన్ని చేసినా ఎంత ఖర్చు పెట్టినా శరవణన్ పై ట్రోలింగ్ మాత్రం అలానే ఉంది. మరి జనాలు ఈ చిత్రాన్ని ఏ మేరకు ఆదరిస్తారో చూడాలి.




# స్టార్ ప్రొడ్యూసర్ అత్యుత్సాహమే బెడిసికొట్టిందా?

కొన్ని సార్లు జాగ్రత్త పడకపోతే నష్టపోతుంటాం. కానీ కొన్ని సార్లు అతి జాగ్రత్త వల్ల కూడా నష్టపోవాల్సి వస్తుంటుంది. ఇది తాజాగా స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు విషయంలో రుజువైందనే కామెంట్ లు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. దిల్ రాజు నిర్మించిన లేటెస్ట్ మూవీ 'థాంక్యూ'. నాగచైతన్య హీరోగా విక్రమ్ కె. కుమార్ తెరకెక్కించారు. రాశీఖన్నా మాళవిక మోహనన్ అవికా గోర్ హీరోయిన్ లుగా నటించారు. వివిధ దశల్లో సాగే ఓ యువకుడి జీవన ప్రయాణం నేపథ్యంలో ఈ మూవీని తెరకెక్కించారు.'బంగార్రాజు' తరువాత నాగచైతన్య నటించిన మూవీ కావడంతో అక్కినేని ఫ్యాన్స్ భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం భారీ స్థాయిలో ఈ మూవీని విడుదల చేశారు. అయితే రిలీజ్ కు ముందు రోజు ఏపీలోని కొన్ని చోట్ల ప్రీమియర్ షోలని ఏర్పాటు చేశారు. ముందే టాక్ బయటికి రావడంతో ఈ మూవీకి భారీ ఎదురు దెబ్బ తగిలింది. భారీ స్థాయిలో ఓపెనింగ్స్ ని రాబట్టాల్సిన ఈ మూవీ ఆశించిన స్థాయిలో రాణించలేక పోయింది.ముందు నుంచి ఈ మూవీపై పాజిటివ్ బజ్ క్రియేట్ కాలేదు. దాన్ని దృష్టిలో పెట్టుకునే నిర్మాత దిల్ రాజు అడ్వాన్స్ ప్రీమియర్స్ ని నైజాంలో అందులోనూ హైదరాబాద్ లో ఏర్పాటు చేయకుండా ఏపీలో ఏర్పాటు చేసి అతి జాగ్రత్త పడ్డారని అదే ఈ సినిమాకు బిగ్ షాక్ గా మారిందని అంటున్నారు.అంతే కాకుండా ఏపీలో ప్రీమియర్ షోస్ గురువారం రోజే పడిపోవడంతో నెగెటివ్ టాక్ బయటికి వచ్చింది. దీంతో శుక్రవారం సినిమాకు వెళ్లాలనుకున్న చాలా మంది ప్రేక్షకులు ఆ ప్రయత్నాలని విరమించుకున్నారట.దీని కారణంగా చాలా వరకు థియేటర్లలో ఈ మూవీకి 20 శాతానికి మించి ఆక్యుపెన్సీ దక్కడం పలువురిని షాక్ కు గురిచేస్తోందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. ఇంత వరకు నాగచైతన్య సినిమాకు ఈ స్థాయి ప్రేక్షకులు థియేటర్లకు రావడం ఇదే మొదటి సారని చెబుతున్నారు. ఇటీవల నాగచైతన్య నటించిన 'బంగార్రాజు 'లవ్ స్టోరీ' చిత్రాలకు మంచి ఓపెనింగ్స్ లభించాయి.అయితే 'థాంక్యూ' సినిమాకు మాత్రం అందులో సగం కూడా రాకపోవడం విచిత్రంగా వుందని ట్రేడ్ వర్గాలు వాపోతున్నాయి. కోవిడ్ తరువాత విడుదలైన 'బంగార్రాజు 'లవ్ స్టోరీ' చిత్రాలకు మంచి ఓపెనింగ్స్ లభిస్తే 'థాక్యూ'కు ఇలా ఎందుకు జరిగిందని లోపం ఎక్కడ జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



# విండీస్‌తో టీ20 సిరీస్.. టీమిండియాకు భారీ షాక్! సిరీస్ మొత్తానికి అతడు దూరం?

వెస్టిండీస్‌తో టీ20 సిరీస్ నేపథ్యంలో టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. టాపార్డర్ బ్యాటర్, పరిమిత ఓవర్ల వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ ఈ సిరీస్ మొత్తానికి దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే అతడు కోవిడ్ బారిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అతడు కోలుకున్నట్లు సమాచారం.అయితే, రాహుల్ ఆరోగ్య పరిస్థితిని సమీక్షించిన బీసీసీఐ మెడికల్ కమిటీ.. మరో వారం రోజుల పాటు అతడిని విశ్రాంతి తీసుకోవాల్సిందిగా సూచించినట్లు తెలుస్తోంది. దీంతో విండీస్‌తో టీ20 సిరీస్ మొత్తానికి అతడు దూరం కానున్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. కాగా స్వదేశంలో దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు ముందు గాయపడ్డ కేఎల్ రాహుల్.. జర్మనీలో స్పోర్ట్స్ హెర్నియాకు చికిత్స చేయించుకున్నాడు.ఆ తర్వాత భారత్‌కు తిరిగి వచ్చి జాతీయ క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్నాడు. ఈ క్రమంలో అతడికి కరోనా సోకగా ఐసోలేషన్‌కు వెళ్లాడు. అయితే కోవిడ్ నుంచి కోలుకున్నప్పటికీ ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు తగిన సమయం లేకపోవడంతోనే వెస్టిండీస్ పర్యటనకు దూరమైనట్లు సన్నిహిత వర్గాల సమాచారం. ఇక బుధవారం (జూలై 27) నాటి ఆఖరి వన్డే తర్వాత.. శుక్రవారం(జూలై 29) నుంచి టీమిండియా వెస్టిండీస్‌తో టీ20 సిరీస్ మొదలు కానుంది. ఈ క్రమంలో రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు ఇప్పటికే విండీస్‌కు చేరుకుంది.రోహిత్ శర్మ (కెప్టెన్), ఇషాన్ కిషన్, కేఎల్ రాహుల్×, సూర్యకుమార్ యాదవ్, దీపక్ హుడా, శ్రేయాస్ అయ్యర్, దినేశ్ కార్తీక్, రిషబ్ పంత్, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, ఆర్ అశ్విన్, రవి బిష్ణోయ్, కుల్దీప్ యాదవ్×, భువనేశ్వర్ కుమార్, అవేష్ ఖాన్, హర్షల్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190